TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేదికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 30 | ఎడిటర్ : కందాడి మహేందర్ రెడ్డి | మంగళవారం 30 - 6 - 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-

## ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

- రైతులకు, రైస్ మిల్లర్లకు రెట్టింపు లాభాలు
- ప్రపంచ మార్కెట్లే లక్ష్యంగా ఫోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తులు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కేసీపీ న్యూట్రీ సంస్థ మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తుల ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 29**

రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణలో బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది గానీ ఎగుమతుల కోసం కాదని, అందుకే తెలంగాణ ప్రభుత్వం బియ్యం ఎగుమతులను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతోందని తెలిపారు.రాష్ట్ర రైతులు, రైస్ మిల్లర్ల ప్రయోజనాల కోసం దేశీయ మార్కెట్లతో పాటు విదేశీ మార్కెట్లను కూడా లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు చేపట్టే పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అనుమతులను సైతంవేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.మల్టీ విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ మంచి ఆదరణ పొందే అవకాశముందని చెప్పారు. రాష్ట్ర ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలు, విదేశీ మార్కెట్లకు చేరేలా




ప్రభుత్వం అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

**దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ**

వ్యవసాయరంగంలో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, అదే సమయంలో భౌగోళికంగా పెద్ద రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 25 లక్షల టన్నుల కొనుగోలు మాత్రమే జరిగిందని మంత్రి పేర్కొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇప్పటికే రూ.19,303 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు. పారదర్శకతతో,వేగవంతంగా రైతులకు చెల్లింపులు జరిపిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి చూస్తే రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల టన్నులు దాటిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల వినియోగం సంవత్సరానికి కేవలం 36 లక్షల టన్నులు మాత్రమే ఉండటంతో తెలంగాణ ఇప్పుడు మిగులు బియ్యం ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులఆధునీకరణ, సాగునీటి విస్తరణ,రైతులకు నిరంతర నీటి లభ్యత కల్పించడం వల్లే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.



## ప్రజల ఐక్యత అంతర్జాతీయ వేదికపై దేశానికి బలం

- బంగారం కొనుగోళ్లు తగ్గించారు.. ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- బంగారం కొనుగోళ్లు, ఇంధన వాడకం తగ్గించినందుకు ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని చేసిన విజ్ఞప్తికి అద్భుత స్పందన
- సీషెల్స్ పర్యటన నుంచే 135వ మన్ కీ బాత్‌లో ప్రసంగించిన ప్రధాని

**న్యూఢిల్లీ,జూన్29,**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, బంగారు కొనుగోళ్లు తగ్గించడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన భారతీయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ప్రజలు కనబరిచిన ఈ సహకారం దేశ ఐక్యతకు, శక్తికి నిదర్శనమని కొనియాడారు.ప్రస్తుతం సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుండే ఈ కార్యక్రమం ద్వారా దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనేక కుటుంబాలు నూతన బంగారు ఆభరణాల కొనుగోళ్లకు దూరంగా ఉండి, వివాహ వేడుకలకు పాత బంగారాన్నే పునర్వినియోగించడంఅభినందనీయమన్నారు.

అలాగే, అనేకమంది తమ విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, కార్‌పూలింగ్ పాటించడం మరియు మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఆశ్రయించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేశారని ప్రశంసించారు. ఈ సామూహిక కృషి అంతర్జాతీయ వేదికపై భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని

ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా జూన్ మాసంలో రక్షణ రంగంలో దేశం సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు.అహ్మదాబాద్‌లో నిర్వహించినవరల్డ్ యోగా ఆసనా ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు కనబరిచిన అద్భుత ప్రతిభను ఆయన అభినందించారు.

## రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం

- సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ తో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీ, సింగపూర్ మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతంపై చర్చలు
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను, పారదర్శక విధానాలను వివరించిన మంత్రి

**అమరావతి,జూన్29,**

ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు జరిగాయి. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తో చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్



ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ ఇవాళ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని సింగపూర్ ప్రతినిధికి వివరించారు. ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పెట్టుబడులను క్షేత్రస్థాయికి తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు.

## ఏపీలో విస్తారంగా వర్షాలు

- ఏపీపై రెండు ద్రోణుల ప్రభావం కొనసాగుతోందన్న ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్
- రెండు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడి



**అమరావతి,జూన్29,**

ఆంధ్రప్రదేశ్‌పై రెండు ఉపరితల ద్రోణుల ప్రభావం కొనసాగుతోంది. వీటి ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు, రానున్న రెండు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

## పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలి

- వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క
- జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క
- జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది

**హైదరాబాద్,జూన్29,**

వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు.జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియ జేశారు. ఎంజీఎన్



ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొన సాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

## రామమందిరం విరాళాల కేసు.. అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నో

- రామ మందిరం విరాళాలపై పిల్ దాఖలు
- సెలవుల తర్వాత విచారణ చేపడతామన్న కోర్టు
- ఫోరెన్సిక్ ఆడిట్‌కు పిటిషనర్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,జూన్29,**

అయోధ్య రామమందిర విరాళాల చోరీపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వేసవి సెలవులు ముగిసిన వెంటనే ఈ పిటిషన్‌ను విచారణకు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ అంశంలో అంత అత్యవసరం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది.



## అదానీ కేసులో కీలక మలుపు

- గౌతమ్ అదానీపై కేసు ఉపసంహరణకు అమెరికా న్యాయశాఖను వివరణ కోరిన ఫెడరల్ జడ్జి
- జడ్జి ఆదేశం కేసు కొట్టివేతను నిలువరించలేదని న్యాయ నిపుణుల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్29,**

భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ఇతరులపై ఉన్న క్రిమినల్ కేసును ఉపసంహరించుకోవాలన్న అమెరికా న్యాయశాఖ అభ్యర్థనపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అక్కడి ఫెడరల్ జడ్జి ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ పరిణామం కేసు కొట్టివేతను ఏమాత్రం ప్రభావితం చేయబోదని, ప్రాసిక్యూషన్ విచక్షణాధికారమే అంతిమమని ప్రముఖ అమెరికన్, భారతీయ న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని గడువులోపు పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి



**నమస్తే భారత్: భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (మూర్తి):** ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం--2026లో భాగంగా ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి, ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఫారం అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ కార్యాలయం, క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) మాత్రమే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేపట్టరాదని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన ఓటర్లకు ఫారాలను అందజేయడంతో పాటు, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలను సమర్పించిన ఓటర్ల వివరాలనే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగిస్తామని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా తన ఫారాన్ని సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ అధికారులతో మాట్లాడుతూ , రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, నిర్ణీత గడువులోపు వాటిని తిరిగి సేకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఎన్నికల శాఖ సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు. పూర్తి చేసి, ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఫారం అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ కార్యాలయం, క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) మాత్రమే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేపట్టరాదని ఆదేశించారు.ప్రతి బీఎల్‌వో తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన ఓటర్లకు ఫారాలను అందజేయడంతో పాటు, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలను సమర్పించిన ఓటర్ల వివరాలనే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగిస్తామని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా తన ఫారాన్ని సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ అధికారులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, నిర్ణీత గడువులోపు వాటిని తిరిగి సేకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఎన్నికల శాఖ సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసన్‌ల జీవితాల్లో ఎప్పుడు వెలుగు?

**- విద్యుత్ ఉద్యోగుల సేవలకు గుర్తింపు ఎక్కడ?**
**- 25 ఏళ్లుగా ప్రాణాలను పణంగా పెట్టి వినియోగదారులకు నిరంతర సేవలు**
**- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23 వేల మంది ఆర్టిసన్ కార్మికుల ఆవేదన**
**- దశాబ్దంగా ప్రమోషన్లు, గ్రేడ్ మార్పులు లేక ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ**
**- ప్రభుత్వాలు మారినా సమస్యలకు మాత్రం పరిష్కారం కనిపించని పరిస్థితి**
**- విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టిసన్‌లు**
**- సమస్యలు పరిష్కరించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి**




కుత్బుల్లాపూర్, జూన్ 29 (నమస్తే భరత్ ); ఇళ్లలో వెలుగులు నింపే విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఆర్టిసన్ కార్మికుల జీవితాల్లో మాత్రం ఇంకా చీకట్లు తొలగడం లేదు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా వర్షం, గాలి, ఎండ, రాత్రి అనే తేడా లేకుండా ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్న ఈ ఉద్యోగులు, తమ న్యాయమైన హక్కుల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో సుమారు 23వేల మంది ఆర్టిసన్ కార్మికులు గత రెండు దశాబ్దాలకు పైగా వినియోగదారుల సేవలో అంకితభావంతో పనిచేస్తున్నారు. విద్యుత్ అంతరాయాలు, అత్యవసర మరమ్మతులు, ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి అత్యంత క్లిష్టమైన బాధ్యతలను వీరే నిర్వహిస్తున్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లోనూ విధులు నిర్వర్తించడం వారి దినచర్యగా మారింది. అయితే ఉద్యోగ బాధ్యతలు పెరుగుతున్నా, ఉద్యోగ పరమైన ప్రయోజనాలు మాత్రం అందడం లేదని ఆర్టిసన్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా ప్రమోషన్లు లేకపోవడం,గ్రేడ్ మార్పులు నిలిచిపోవడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొందని చెబుతున్నారు. సేవా కాలం పెరుగుతున్నా పదోన్నతులు లేకపోవడం వల్ల ఆర్థిక, ఉద్యోగ భద్రత పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ఎదురు చూసినా, ఇప్పటి వరకు ఆశించిన ఫలితం కనిపించలేదని వారు పేర్కొంటున్నారు. విద్యుత్ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సేవలకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. ఆర్టిసన్ కార్మికుల ప్రధాన డిమాండ్లలో ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించడం, గ్రేడ్ మార్పులను అమలు చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ సంబంధిత సమస్యలను పరిష్కరించడం ఉన్నాయి. తమ సేవలను గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. విద్యుత్ వ్యవస్థను నిరంతరం సజావుగా నడిపిస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆర్టిసన్ కార్మికుల జీవితాల్లో కూడా ప్రభుత్వం వెలుగులు నింపాలని వారు ఆకాంక్షిస్తున్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆర్టిసన్ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

## - టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

నమస్తే భారత్ :-తొర్రూరు పాలకుర్తి నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చీకటయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని గౌతమ్ రెడ్డి తండ్రి నాయిని ప్రభాకర్ రెడ్డి,ఏర్పు కొండ ముత్తయ్యలు ఇటీవల మృతి చెందగా,తొర్రూరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బాక వెంకటరెడ్డి సోదరుడు దుబ్బాక లక్ష్మారెడ్డి, సోదరి రాజశ్రీ లు రెండు రోజుల వ్యవధిలోనే మృతి చెందడంతో వారి స్వగ్రామమైన మరిపెడకు వెళ్లి ఝాన్సీ రెడ్డి సోమవారం వారి కుటుంబాలను సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం లోని పలు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు..



బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాలు సకాలంలో చేరే విధంగా ప్రజా ప్రతినిధులు అధికారులు చూడాలన్నారు. ఆమె వెంట తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాపల బాపురెడ్డి,పెదగాని సోమయ్య, గంజి విజయపాల్ రెడ్డి,జక్కా మహబూబ్ రెడ్డి,కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,నాయకులు మంగళపల్లి రామచంద్రయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్,వాసుదేవా రెడ్డి,దొంగరి శంకర్,యనమల శ్రీనివాస్,ధర్మారపు కిరణ్,నడిగడ్డ మధు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్--2047 సాధనలో యువతే కీలక శక్తి...

- హైదరాబాద్‌లోని వీబీఐటీ కళాశాలలో ఘనంగా 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్'
- విద్యార్థులతో మమేకమైన బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం
- నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు
- విద్య, ఉపాధి, స్టార్టప్‌లు, సాంకేతికతపై విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు
- అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనకు యువత ముందుండాలని సూచన
- ఎంపీలు, పార్టీ నాయకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరు




కుత్బుల్లాపూర్, జూన్ 29 (నమస్తే భరత్): అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వీబీఐటీ (ఎదీxు) కళాశాలలో భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు. యువత తమ ప్రతిభ, ఆవిష్కరణలు, నైపుణ్యాలను దేశ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవడం ద్వారా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు నాయకులు సమాధానాలు ఇస్తూ విద్య, ఉపాధి అవకాశాలు, స్టార్టప్‌ల ప్రోత్సాహం, సాంకేతిక రంగంలో అభివృద్ధి, నవకల్పనలు, భారత భవిష్యత్ ప్రగతి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వివరించారు. అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, బీజేపీ, బీజేవైఎం రాష్ట్ర పదాధికారులు, పార్టీ నాయకులు, వివిధ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# ఆక్రమణలపై దుండిగల్ అధికారుల ఉక్కుపాదం

**- మల్లంపేట్, బౌరంపేట్‌లో ప్రత్యేక డ్రైవ్ - ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాల తొలగింపు**
**- 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనుల పరిశీలన**
**- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బహిరంగ స్థల ఆక్రమణ యత్నానికి అడ్డుకట్ట**
**- ప్రజా స్థలాల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక**



దుండిగల్, జూన్ 29 ( నమస్తే భరత్ ): నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆక్రమణలపై దుండిగల్ మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం మల్లంపేట్, బౌరంపేట్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, బహిరంగ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. ఈ నేపథ్యంలో మల్లంపేట్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించి వెంటనే తొలగించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఫుట్‌పాత్‌లను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇదే సందర్భంగా మల్లంపేట్ 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన రోడ్ మార్కింగ్ పనులను అధికారులు పరిశీలించారు. విస్తరణకు సంబంధించిన సాంకేతిక అంచనాలను సిద్ధం చేసి తదుపరి చర్యలకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ ఆడే బహిరంగ ప్రాంగణంలో అక్రమంగా చిన్న చిన్న దుకాణాలను నిర్మిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు వెంటనే స్పందించారు. నిర్మాణ పనులను నిలిపివేసి, బహిరంగ స్థలాలను ఆక్రమించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరంలో ఫుట్‌పాత్‌లు, రహదారులు, పార్కులు, బహిరంగ స్థలాలను పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని అధికారులు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే ఆక్రమణలపై ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కోతి రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్



నమస్తే భారత్ :-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం, చిన్నగూడూరు మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన కోతి జితేందర్ రెడ్డి మాతృమూర్తి
రాజమ్మ ఇటీవల మరణించగా, నేడు మరిపెడ బంగ్లాలోని వారి నివాసానికి చేరుకున్న మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ వారికి ధైర్యం చెప్పారు.

# నూతన జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

నమస్తే భారత్: భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (మూర్తి): ద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ సమీపంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, ఎస్పీ క్యాంప్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడిన ఎస్పీ గారు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్, ఆర్ బీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## పొదుపు బాటలో 40 దేశాలు!

ఒక ఏడాది పాటు ఖర్చులు తగ్గించుకోండి. బంగారం కొనుగోలు చేయకండి. విలాసవంతమైన వస్తువుల కోసం డబ్బులు వెచ్చించకండి.. ఇటీవల హైదరాబాద్ సభలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు ఇది. సహజంగానే ప్రధానమంత్రి పిలుపునకు వక్రీకరణలు చేసేస్తుంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు కూడా అదే పని చేసింది.. వాస్తవానికి పొదుపు అనేది మన జీవితంలో ఒక భాగం అయితే అది చాలా బాగుంటుంది.. ఉదాహరణకు మనకు జ్వరం వస్తే డాక్టర్ మాంసాహారం తినవద్దని చెబుతుంటారు. దానివల్ల ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందని డాక్టర్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తారు. దానిని మనం సానుకూలంగా తీసుకోవాలి. అంతేతప్ప వ్యతిరేకంగా తీసుకుంటే మన ఆరోగ్యమే పాడవుతుంది. ఇదే విషయాన్ని నరేంద్ర మోడీ పరోక్షంగా చెప్పారు. దేశ ప్రధాని సూచించిన పొదుపు మంత్రాన్ని మనలో చాలామంది వ్యతిరేకంగా చూస్తున్నారు గాని.. మన మాదిరిగానే ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నాయి.పచ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు ప్రపంచానికి కొత్త పాఠాలు నేర్పుతోంది. అయితే దీని నుంచి తేరుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు చర్యలను పాటిస్తున్నాయి.. ఇంతకీ ఆ జాబితాలో ఎటువంటి దేశాలు ఉన్నాయంటేమన పక్కనే ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక, పెరూ వంటి దేశాలు పాఠశాలలకు సంబంధించిన పని దినాలను పూర్తిగా తగ్గించాయి. రిమోట్ లెర్నింగ్ విధానాన్ని పెంచేశాయి.. శ్రీలంకలో అయితే బుధవారాలలో కార్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. జోర్డాన్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు సంబంధించిన అంతర్జాతీయ ప్రయాణాలను పూర్తిగా నిషేధించాయి. విదేశాలకు సంబంధించిన ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడాన్ని జోర్డాన్ పూర్తిగా తగ్గించింది. ప్రభుత్వ భవనాలలో ఏసీల వినియోగాన్ని కూడా తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్లో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మసీద్ ప్రాంతాలలో ఏసీల వినియోగాన్ని కనీసం 25ళీ లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీలంక, మలేషియా, థాయిలాండ్ ప్రాంతాలలో కూడా ఇటువంటి ఆదేశాలు అమలులో ఉన్నాయి.ఆస్ట్రేలియాలో ఎవరీ లిటిల్ బీట్ హెల్ప్స్ ప్రచారం మొదలైంది. ఇది ఇంధన వీడియో గాని స్వచ్ఛందంగా ప్రోత్సహిస్తూ ఉంటుంది.బ్రిటన్ దేశంలో చిన్న చిన్న వ్యాపారులు ఎలక్ట్రిక్ హీటింగ్ విధానానికి మారిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. దానికోసం ఆర్థిక సహాయం పొందడానికి బాయిలర్ ఆఫ్ గ్రేడ్ పథకాన్ని ఇటీవల మొదలుపెట్టారు.. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి శ్రీలంక ప్రభుత్వం బిల్ బోర్డులపై లైట్లు ఆపివేస్తోంది. ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు నాలుగు రోజుల పని దినాలు అమలులో ఉన్నాయి. ఇందులో 50% రిమోట్ వర్క్ విధానాన్ని అక్కడి ప్రభుత్వాలు అందుబాటులో తీసుకొచ్చాయి. ఇండోనేషియాలో ప్రభుత్వ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు ఇంటి వద్ద నుంచి పనిచేస్తున్నారు.. మయన్మార్ దేశంలో బుధవారం రిమోట్ వర్క్ విధానం అమలులో ఉంది. వియత్నాం కూడా ఇదే విధానాన్ని అమలు చేసే పనిలో ఉంది. మరో వైపు బంగారం ఎలా అయితే మెరుస్తుందో.. దీని ఆధారంగా సాగే రంగాలు అదే స్థాయిలో దూసుకుపోతుంటాయి. అయితే బంగారం వినియోగం స్థాయిలో ఉత్పత్తి లేకపోవడంతో భారత్ లాంటి దేశం దిగుమతుల మీద ఆధారపడుతూ ఉంటుంది. ఈ దిగుమతులే ఇప్పుడు భారత్ కు గుదిబండ లాగా మారిపోయాయి.. అందువల్లే భారత ఆర్థిక వ్యవస్థ బంగారం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. అయినప్పటికీ బంగారం దిగుమతులు మనదేశంలో తగ్గడం లేదు. బంగారం దిగుమతికి అధికంగా ఫారెక్స్ నిల్వలను ఖర్చు చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో భారత్ సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకుంది.సుంకం పెంచడం వల్ల మనదేశంలో ఉన్న బంగారం, వెండి ధరలు పెరుగుతాయి. పాత బంగారం రీసైక్లింగ్ కు వచ్చేస్తూ ఉంటుంది. దీనివల్ల దిగుమతులు చాలా వరకు తగ్గుతాయి. అదే సమయంలో పన్నులు అధికంగా ఉన్నప్పుడు.. అక్రమ మార్గంలో బంగారం దేశానికి దిగుమత అయ్యే ప్రమాదం లేకపోలేదు.. దీనిని ఏ విధంగా అడ్డుకుంటారనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే మన దేశంలో ఉన్న ప్రధాన విమానాశ్రయాలలో ప్రతిరోజు కస్టమ్స్ అధికారులు విదేశాల నుంచి అక్రమంగా వస్తున్న బంగారాన్ని పట్టుకుంటున్నారు. అయితే ఇప్పుడు బంగారం మీద సుంకం పెంచిన నేపథ్యంలో.. అధికారులు దాడులను మరింత తీవ్రం చేసే అవకాశం ఉంది.ఇక మనదేశంలో బంగారం మీద సుంకం విధించడం ఇదే తొలిసారి కాదు. 2022లో బంగారం మీద సుంకం 10.75 శాతం ఉండేది. అప్పుడు దానిని 15% కి పెంచారు. 2024 లో మనదేశంలో ఆభరణాల పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సుంకం మొత్తాన్ని ఆరు శాతానికి తగ్గించారు.. మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం వల్ల సుంకం మొత్తాన్ని ఆరు శాతం నుంచి 15% పెంచారు. 2012 కంటే ముందు కూడా బంగారం పై దిగుమతి సుంకం ఉండేది. అయితే బంగారం విలువతో సంబంధం ఉండేది కాదు. 10 గ్రాములకు కేవలం 300 రూపాయలు చొప్పున సుంకం వసూలు చేసేవారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాట్ అనే విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అప్పుడు బంగారం విలువలో రెండు శాతం కస్టమ్స్ టాక్స్ విధించేవారు. దీంతో నాడు బంగారం మీద ఒక శాతంగా ఉన్న దిగుమతి సుంకం డబుల్ అయింది. బడ్జెట్లో అయితే దానిని నాలుగు శాతం పెంచేశారు.2013లో రూపాయి విలువ దారుణంగా పతనమైంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ సంవత్సరం ప్రభుత్వం ఏకంగా మూడుసార్లు సుంకాన్ని పెంచేసింది. 2013లో జనవరిలో నాలుగు శాతం నుంచి ఆరు శాతానికి పెంచింది. జూన్ నెలలో ఏకంగా 6 నుంచి 8 శాతానికి పెంచింది. ఆగస్టులలో 8 నుంచి 10 శాతానికి పెంచింది. 2014 అంటే నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2018 వరకు దాదాపు 10 శాతం దిగుమతి సుంకం మాత్రమే వసూలు చేసేవారు. 2019లో 12.5% పెంచేశారు. 2021 కేంద్ర బడ్జెట్లో 12.5% నుంచి 10.75% తగ్గించారు. తాజాగా 15%సుంకం పెంచిన నేపథ్యంలో.. దాని విలువలను కేంద్రం బయట పెట్టింది. 10 శాతాన్ని ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీగా.. ఐదు శాతం అగ్రికల్చర్ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ సెస్ గా ప్రకటించింది.

# అమ్మా నాన్నా.. ఒక్క క్షణం ఆగండి!



అమ్మ ఒడిలో హాయిగా నిద్రపోతున్న చిన్నారులకు అంతకు మించిన సురక్షిత చోటు ఈ ప్రపంచంలో లేదు! చేతుల్లో చెయ్యి వేసి నడక నేర్పించే నాన్నను తలదన్నే భరోసా కూడా ఎక్కడా ఉండదు! కానీ ఈ మధ్య కొన్ని దురదృష్టకర సంఘటనల్లో ముక్కుపచ్చలారని పిల్లలకు అమ్మానాన్నే మృత్యువులవుతున్నారు. అప్పటివరకు అమ్మతో పాటు ప్రశాంతంగా నిద్రపోతున్న పిల్లలు తెల్లారేసరికి మృత్యువు పాలవుతున్నారు. రాత్రంతా నాన్న భుజాలపై ఆటలాడుకున్న బుడతలు పొద్దున లేచేసరికి విగతజీవులవుతున్నారు. ఆర్థిక సమస్యలో.. వ్యక్తిగత కారణాలో.. పిల్లలను దూరంచేసి బతికున్న వాళ్లను సాధించాలనో .. ఏదో .. ఇంకేదో .. కారణం ఏదైనా పిల్లలు ఈ ప్రపంచంలో లేకుండా పోతున్నారు. అమ్మానాన్నల ప్రేమలో తడిసిముద్దవ్వాల్సిన ఆ చనిపోయిన పిల్లలకుమళ్లీ ప్రాణం వస్తే .. ఏం అడుగుతారు? "అమ్మా .. నేనంటే నీకు ఎంతో ఇష్టం కదా! నాకు చిన్న దెబ్బ తగిలితేనే నీ కళ్లల్లో నీళ్లు వచ్చేవి కదా! నాకు జ్వరం వస్తే .. రాత్రంతా మేల్కొని నా పక్కనే కూర్చొన్నావు. నేను కోలుకునేదాకా నువ్వు కడుపునిండా తిన్నదే లేదు. నాన్నా .. నడుస్తూ నడుస్తూ నేను నీళ్లల్లో జారి పడిపోతుంటే నువ్వు ఎంత కంగారు పడ్డావో నాకు బాగా గుర్తు. నీ దగ్గర డబ్బులు లేకపోయినా నాకు కొత్త బట్టలు కొనిచ్చావు. చెప్పులు కొన్నావు. పుస్తకాలు, స్కూలు బ్యాగు ఒకటా రెండా .. నాకు కావల్సినవన్నీ తెచ్చిపెట్టావు. ఇంత ప్రేమ చూపించే మీకు మా గొంతు నులిమి చంపేయాలని ఎందుకు అనిపించింది? నీళ్లంటే మాకు భయమని తెలిసినా బావిలో ఎందుకు పడేశారు? నీళ్ల బకెట్లో మా తలలు ముంచి ఊపిరాడకుండా చేసినప్పుడు నీ కళ్లల్లో కన్నీ ళ్లు రాలేదా నాన్నా ..! మంచం మీద ఎగురుతూ ఎగురుతూ ఫ్యాను తగులుతుందేమో అని భయపడే అమ్మ .. ఆ ఫ్యానుకే మమ్మల్ని ఎలా ఉరివేశావు? గోరుముద్దలతో మా ఆకలి తీర్చే నువ్వు, అంతే ప్రేమగా విషం కలిపిన అన్నం ఎలా తినిపించావు?

అమ్మానాన్న మీకు ఏమైంది?: పిల్లలతో ఎంతో సంతోషంగా జీవించాలని కలలుగన్న మీరు ఉన్నట్లుండి మౌనంగా ఎందుకు మారిపోయారు! ప్రపంచం నిండా జనాలున్నా మీరెందుకు ఒంటరి అయ్యారు? సమస్యలు చుట్టుముడితే ప్రాణాలు తీసుకోవడమే పరిష్కారమని మీకెవరు చెప్పారు! మీరు లేకపోతే మేం బతకలేమని, మమ్మల్ని కూడా చంపేయాలని మీకు ఎందుకు అనిపించింది? అయితే అమ్మానాన్న .. ఒక్క క్షణం ఆగండి.. మా బతుకు మీరు ఇచ్చిందే కావచ్చు .. మా భవిష్యత్తు గురించి మీరు ఎన్నో కలలు కనొచ్చు. పరిస్థితులు సరిగ్గా లేవని, మమ్మల్ని ఇక 'బాగా' పెంచలేమని మీరు భయపడి ఉండొచ్చు. కానీ అమ్మానాన్న .. ఈ ప్రపంచం నిండా ఎన్నో సమస్యలున్నాయి. ధనిక, పేద తారతమ్యం, కుల, మతాల చిచ్చులు, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, కార్చిచ్చులు, వరదలు, కరువులతో ఎప్పుడూ ఎన్నో ఒడిదుడుకులు ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. అయినా ప్రపంచం ఆగిపోదు .. అన్నింటినీ దిగమింగి ముందుకే నడుస్తుంది. మాకు ఈ ప్రపంచమే ఆదర్శం .. మేము అచ్చం ఈ ప్రపంచంలానే జీవించాలనుకుంటున్నాం. అందుకే ఓ అమ్మానాన్న.. ఒక్క క్షణం ఆలోచించండి. ప్రపంచాన్ని చూసి ధైర్యం తెచ్చుకోండి.

భవిష్యత్తు అంటే భయం వద్దు ..: భవిష్యత్తు అంటే బంగారుమయంగానే ఉండక్కర్లేదు. కోరినవన్నీ సాధించక్కర్లేదు. అందలాలు ఎక్కర్లేదు. ఒకరితో ఒకరం పోటీ పడకుండానే జీవించవచ్చు. చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్కపోయినా బతకవచ్చు. మోసపోయినా, నష్టం వచ్చినా జీవితం ఆగిపోదు. అనారోగ్యం వచ్చినా, ఆస్తులు కరిగిపోయినా దిగాలు వద్దు. ధైర్యంతో ఉండండి. మీరు బతకండి. మమ్మల్నీ బతికించండి. మా ఆనవాళ్లు ఈ ప్రపంచంలో లేకుండా చేయకండి. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకున్న ప్రపంచం పిల్లలు లేకపోతే తట్టుకోలేదు. పిల్లలు లేని ప్రపంచం శ్మశానం కంటే భయంకరం. ప్రపంచానికి ఆ దుస్థితి తీసుకురాకండి. ఇప్పుడు మేం ఈ ప్రపంచంలో లేము..మా అమ్మానాన్న ఉన్నారో లేదో తెలియదు.. మా పరిస్థితి ఏ పిల్లలకూ తీసుకురావద్దని ప్రతి అమ్మానాన్నను కన్నీళ్లతో వేడుకుంటున్నాం. బతికితేనే కదా, జీవితానికి విలువ..."

విపరీతాలు.. విషాదాలు: ఆర్థిక సమస్యలతో, వివాహేతర సంబంధాలతో, అవమాన భారాలతో పిల్లలను కడతేర్చి తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో రోజుకొక ఉదంతం వెలుగుచూస్తోంది. నెలలు నిండని పసికూనల నుండి, యుక్తవయసు వచ్చిన పిల్లల వరకు ఈ ఘటనల్లో బాధితులుగా ఉన్నారు. జనవరి నెలలో మహారాష్ట్ర పూణెలో కుటుంబ కలహాలతో ఓ తల్లి 11, 13 ఏళ్ల పిల్లలను తీవ్రంగా కొట్టి చంపింది. ఫిబ్రవరిలో సోలాపూర్లో ఓ తండ్రి చెడు వ్యసనాలకు బానిస అయిన కొడుకుకు విషం ఇచ్చి చంపాడు. హైదరాబాద్లో సాఫ్ట్వేర్ ఇంజినీర్ తన ఇద్దరు బిడ్డలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది.

# రూ.7 లక్షల కోట్లు ఆవిరి



- దలాల్ స్ట్రీట్కు ఎఫ్ఐఐ సెగలు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పతనం
- ఇండిగో షేర్ల కుదేలు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ మదుపర్లు ముఖం చాటేస్తోన్నారు. వరుస అమ్మకాలతో దలాల్ స్ట్రీట్కు సెగలు పుట్టిస్తున్నారు. రూపాయి రికార్డ్ పతనం, భారత్ %-% అమెరికా వాణిజ్య ఒప్పందంపై సానుకూల సంకేతాలు కానరాకపోవడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. బిఎస్ఇ సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగి.. తుదకు 610 పాయింట్లు లేదా 0.71 శాతం పతనమై 85,103కు పరిమితమైంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 226 పాయింట్లు లేదా 0.86 శాతం కోల్పోయి 25,961 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైగా ఆవిరై రూ.463 లక్షల కోట్లకు తగ్గింది. దీంతో ఒక్కపూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు కరిగిపోయినట్లయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్డిఎఫ్సి మినహా మిగిలిన 27 షేర్లు ప్రతికూలతను చవిచూశాయి. బిఇఎల్, ఎటెర్నెల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ అధికంగా నష్టపోయాయి. యుఎస్ ఫెడ్ ఈ నెల 10న వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి ఒక్క పూటలోనే రూ.439 కోట్లను ఉపసంహరించుకోగా.. డిసెంబర్లో ఇప్పటివరకు రూ.6,584 కోట్ల విలువైన స్టాక్సను తరలించుకుపోయారు. ఇది మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచిందని నిపుణులు భావిస్తున్నారు. ఇండిగోలో నెలకొన్న సంక్షోభంతో దాని మాతృసంస్థ ఇంటర్గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా క్షీణించాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా నష్టపోగా.. సోమవారం సెషన్లో ఏకంగా 8.28 శాతం లేదా రూ.444.75 నష్టంతో రూ.4,926.55 వద్ద ముగిసింది.

# కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం!




న్యూఢిల్లీ: ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంత రాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయా న మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్ర యాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?ంచిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్పోర్ట్లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది.

# సౌదీలో మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్ను చూపించి, రాజధాని రియాద్లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, ా ఎట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోం ది. రియాద్ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం.

# కాశ్మీర్లో చైనా జాతీయుడి అరెస్ట్..!

న్యూఢిల్లీ: వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్లోని లేహ్, జన్స్కర్తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్ లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్ లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్ట ర్స్కుసమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్ర త్బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచార ణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్తాయ్ తెలిపాడు.



గుండె జబ్బులకు కేవలం కొలెస్ట్రాల్, బీపీ మాత్రమే కాదు..

# ఇవి కూడా కారణమే..

## హెచ్చరిస్తున్న వైద్యులు..

గుండె జబ్బులు అంటే చాలామంది వెంటనే కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, ధూమపానం లేదా వ్యాయామం లేకపోవడం వంటి కారణాలనే గుర్తు చేసుకుంటారు. అయితే వైద్య నిపుణులు ఇప్పుడు మరో కీలక అంశంపై హెచ్చరిస్తున్నారు. శరీరంలో నిశ్శబ్దంగా ఉండే హార్మోన్ల అసమతుల్యతలు కూడా గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగలవని వారు చెబుతున్నారు. ముఖ్యంగా గుండె పరీక్షలు సాధారణంగానే కనిపించినా, లోపల హార్మోన్ సమస్యలు గుండెకు ముప్పు కలిగించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. హార్మోన్లు శరీరంలోని రసాయన సందేశ వాహకాలు. ఇవి మెటబాలిజం నుంచి గుండె స్పందన వరకు అనేక కీలక పనులను నియంత్రిస్తాయి. ఈ హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటే ప్రభావం ఒక్క భాగానికే పరిమితం కాకుండా మొత్తం శరీరంపై పడుతుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యంపై దీని ప్రభావం నెమ్మదిగా కనిపించకుండా పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

థైరాయిడ్ సమస్యలు ఉంటే..: థైరాయిడ్ సమస్యలు గుండె ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపే ప్రధాన కారణాల్లో ఒకటిగా గుర్తిస్తున్నారు. హైపోథైరాయిడిజం అంటే థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉండటం, హైపర్‌థైరాయిడిజం అంటే అధికంగా ఉండటం ఈ రెండూ గుండెకు హానికరమే. థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉంటే కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి రక్తనాళాలు గట్టిపడే ప్రమాదం ఉంటుంది. అదే హార్మోన్ అధికంగా ఉంటే గుండె వేగంగా కొట్టుకోవడం, హృదయ స్పందనలో అసమతుల్యత, అధిక రక్తపోటు వంటి సమస్యలు వస్తాయి. ఇలాంటి థైరాయిడ్ సమస్యల లక్షణాలు చాలాసార్లు గుర్తించకుండా పోతాయి. అలసట, బరువు పెరగడం లేదా తగ్గడం, శక్తి లేకపోవడం వంటి లక్షణాలను చాలామంది ఒత్తిడి లేదా వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు.

ఒత్తిడి హార్మోన్ ప్రభావం..: ఇక కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా గుండె ఆరోగ్యానికి ముప్పుగా మారవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కొనే సమయంలో కార్టిసాల్ ఉపయోగపడుతుంది. కానీ దీర్ఘకాలంగా ఇది అధిక స్థాయిలో ఉంటే అధిక రక్తపోటు, శరీరంలో వాపు, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం, మెటబాలిక్ సమస్యలు వంటి ప్రమాదాలు పెరుగుతాయి. దీని వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం కూడా అధికమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హార్మోన్ల సమస్యలు ఒక్కటే కాకుండా పరస్పరం కలిసిపోవడం వల్ల ప్రమాదం మరింత పెరుగుతుంది. ఉదాహరణకు ఇన్సులిన్ రెసిస్టెన్స్ రక్తనాళాలను దెబ్బతీసి కొవ్వు పేరుకుపోవడాన్ని వేగవంతం చేస్తుంది. మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గిపోవడం వల్ల గుండెకు సహజ రక్షణ తగ్గుతుంది. పురుషుల్లో టెస్టోస్టెరాన్ అసమతుల్యత కూడా మెటాబాలిక్ మార్పుల ద్వారా గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.


ప్రారంభ దశలో లక్షణాలు కనిపించవు..: హార్మోన్ సంబంధిత గుండె సమస్యలను గుర్తించడం కష్టమవడానికి ప్రధాన కారణం ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవడమే. అలసట, నిద్రలేమి, మూడ్ మార్పులు, బరువు పెరగడం వంటి లక్షణాలను చాలామంది జీవనశైలి సమస్యలుగా తీసుకుంటారు. కానీ లోపల హార్మోన్ల అసమతుల్యత గుండెపై ప్రభావం చూపుతూనే ఉంటుంది. అందుకే ఇప్పుడు వైద్యులు సాధారణ కొలెస్ట్రాల్, బీపీ పరీక్షలతోపాటు హార్మోన్ పరీక్షలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా కారణం తెలియని అధిక రక్తపోటు, గుండె స్పందనలో అసమతుల్యత లేదా మెటాబాలిక్ సమస్యలు ఉన్నవారిలో హార్మోన్ స్థాయిలను పరీక్షించడం అవసరమని చెబుతున్నారు.

హార్మోన్ అసమతుల్యతలను ప్రారంభ దశలో గుర్తిస్తే చాలావరకు నియంత్రించవచ్చు. సరైన మందులు, జీవనశైలి మార్పులు, ఒత్తిడి నియంత్రణ, క్రమం తప్పని వైద్య పరీక్షల ద్వారా గుండెకు కలిగే దీర్ఘకాలిక ప్రమాదాలను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యం అంటే కేవలం రక్తనాళాలు, కొలెస్ట్రాల్ మాత్రమే కాదని, శరీరంలోని హార్మోన్ల సమతుల్యతతో కూడా అది ముడిపడి ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, మెటబాలిక్ సమస్యలు పెరుగుతున్న సమయంలో ఈ విషయంపై అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పంచాయితీరాజ్ శాఖకు అవార్డుల పంటలు

కాకినాడ,: ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ పాలన పరంగా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా ఆయన ఆద్వర్యం లో నడుస్తున్న పంచాయితీ రాజ్ శాఖ లో అద్భుతాలు జరుగుతున్నాయి. 2024 వ సంవత్సరం లో దేశం లోనే 24 వ స్థానంలో ఉన్నటువంటి పంచాయితీ రాజ్ శాఖ, పవన్ కళ్యాణ్ చేపట్టిన అద్భుతమైన సంస్కరణల కారణంగా మొదటి స్థానానికి చేరుకొని సంచలనం సృష్టించింది. గడిచిన 23 నెలల్లో ఈ శాఖకు 19 నేషనల్ అవార్డ్స్ వచ్చాయి, ఇది సాధారణమైన విషయం కాదు. గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటివి జరగలేదు. నిజాయితీ తో పని చేసే నాయకుడు సాధించే ఫలితాలు ఎంతటి అద్భుతంగా ఉంటాయో చెప్పడానికి ఇదొక నిదర్శనం అని చెప్పొచ్చు. ప్రతీ నెల ఈ శాఖకు ఎదో ఒక అవార్డు వస్తూనే ఉంది. అయితే ఇప్పటి వరకు వచినటువంటి ఆ 19 అవార్డులు ఏంటో ఒకసారి చూద్దాం పదండి:సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజగవర్గాన్ని దేశం లోనే టాప్ 3 పంచాయితీగా గుర్తించారు. అందుకు గుర్తుగా నానాజీ దేశముఖ్ పురస్కార్ అనే అవార్డుని అందించారు. అదే విధంగా విశాఖపట్నం జిల్లాకు చెందిన శృంగవరం అనే పంచాయితీ కి దేశం లోనే మొదటి స్థానం దక్కింది. 'పంచాయత్ విత్ గుడ్ గవర్నెన్స్' జాబితాలో ఈ అవార్డు ని కేటాయించారు. అదే విధంగా చిత్తూరు జిల్లాలోని కందులపల్లి గ్రామా పంచాయితీ కి 'క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్' క్యాటగిరీ లో మొదటి స్థానం దక్కింది. చిత్తూరు జిల్లాలో ఇలాంటి పంచాయితీలు ఎన్నో అభివృద్ధి చెందడం వల్ల 'పంచాయత్ క్షమత నిర్మాణ్ సర్వోత్తమ్ సంస్థాన్ పురస్కార్' అనే మరో జాతీయ అవార్డు దక్కింది. ఇకపోతే కేవలం ఈ ఒక్క నెలలోనే మరో మూడు జాతీయ పురస్కారాలు దక్కాయి.ఆత్మా నిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డు క్యాటగిరీ లో చిత్తూరు జిల్లాకు చెందిన కానీపాకం కి 2 వ స్థానం లో నేషనల్ అవార్డు దక్కింది. కానీపాకం లో ఈ స్థాయి అభివృద్ధి గతంలో ఎప్పుడూ కూడా జరగలేదు. ఇలా వివిధ శాఖల్లో పంచాయత్ రాజ్ కి జాతీయ అవార్డుల వెల్లువ కురుస్తూనే ఉంది. దేశం లోనే ప్రస్తుతం ప్రతీ ఒక్కరు పంచాయత్ రాజ్ శాఖ ని ఒక రోల్ మోడల్ గా తీసుకొని అభివృద్ధి చేసే పరిస్థితి కి ఈ శాఖ ని తీసుకొచ్చాడు పవన్ కళ్యాణ్. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ ఈ శాఖలో ఇంకెన్ని అద్భుతాలు సృష్టిస్తాడో చూడాలి. మరోపక్క సీఎం చంద్రబాబు నాయుడు కూడా పవన్ కళ్యాణ్ పంచాయత్ రాజ్ శాఖని వృద్ధి చేస్తున్న విధానం పై ప్రశంసల వర్షం కురిపిస్తూ పవన్ కళ్యాణ్ కి అభినందనలు తెలియజేసారు.

# నిమ్మ రైతుల ఆనందం



నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో నిమ్మ ధరలు రికార్డ్ స్థాయిలో పలికాయి. నెల్లూరు జిల్లా పొదలకూరు నిమ్మ మార్కెట్లో రేట్లు అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో 80 కిలోల నిమ్మకాయల బస్తా ధర ఏకంగా రూ.10 వేల వరకు పలికింది.. కిలో రూ.125 వరకు విక్రయిస్తున్నారు. గత పదేళ్ల నుంచి గమనిస్తే ఇంత భారీ ధర పలకలేదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. వాస్తవానికి జనవరిలో కనీస ధర లేకపోవడంతో రైతులు నష్టపోయారు. అయితే ప్రభుత్వం ఆదేశాలతో రైతులు నష్టపోకుండా కలెక్టర్ మార్కెటింగ్‌శాఖ ద్వారా కిలో రూ.8 కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు తరలించారు. మార్చి నెలలో గిట్టుబాటు ధరలు లేక నిమ్మ రైతులు నష్టపోయారు. ఇప్పుడు ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో వారంతా ఆనందంలో ఉన్నారు.నిమ్మకాయలకు ఢిల్లీ మార్కెట్, ఈశాన్య ప్రాంతాల్లో డిమాండ్ పెరిగింది. అక్కడ ఒక నిమ్మకాయ రూ.5 వరకు ధర పలికిందని వ్యాపారులు చెబుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు పొదలకూరు మార్కెట్‌నుంచి రోజుకు 15 లారీల సరుకు తరలిస్తున్నామని చెబుతున్నారు.. దిగుబడులు తక్కువగా ఉన్నాయంటున్నారు. అయితే దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో మంచు, చలి వాతావరణంతో ధరలు ఎక్కువగా లేకపోయినా.. ఇపుడిప్పుడే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. నెల్లూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు.. చాలామందికి నిమ్మ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. మొన్నటి వరకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందిపడ్డ రైతులు.. ఇప్పుడు రికార్డ్ ధరలు రావడంతో సంతోషంలో ఉన్నారు.వాస్తవానికి ఎండాకాలంలో నిమ్మకాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎండ, వేడి నుంచి ఉపశమనం పొందేందుకు జనాలు నిమ్మరసంతో తయారు చేసిన పానియాలను తాగుతారు. దీంతో నిమ్మకాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.. అంతేకాదు ఈ ఎండాకాలంలో నిమ్మ పంట దిగుబడి కూడా తగ్గుతుంది. ఈ క్రమంలో నిమ్మకాయలకు డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి నిమ్మ సాగు చేసిన రైతులకు లాభాల పంట పండుతోందని చెప్పాలి.

# గోదావరి జిల్లాల్లో యంగ్ లీడర్లు...

## జనసేన పార్టీ


ఏలూరు, : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే సభ్యత్వ నమోదును స్పీడప్ చేసింది జనసేన పార్టీ. అయితే అనారోగ్యం, సర్జరీ కారణంగా రెస్ట్ తీసుకుంటున్న పవన్ కళ్యాణ్..పార్టీ ఇంచార్జ్‌ల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జనసేనకు కంచుకోట లాంటి ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆయన వ్యూహ రచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నియోజకవర్గ ఇంచార్జ్ మార్పుపై పవన్ సీరియస్‌గా ఫోకస్ పెట్టినట్లు టాక్. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కనీసం ముగ్గురు కొత్త ముఖాలకు..ఈ సారి కొత్తగా ఇంచార్జ్‌లుగా అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా గోపాలపురం, చింతలపూడి నియోజకవర్గాల్లో పాత ఇంచార్జ్‌లను మార్చి కొత్త వారికి బాధ్యతలు ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్‌గా ఉన్న సువర్ణరాజును తొలగించి మహిళా నేత ఫాతిమారాణికి అవకాశం ఇవ్వొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే చింతలపూడి నియోజకవర్గంలో మేక ఈశ్వరయ్యను తప్పించి ఓ ఎన్నారైకి ఇంచార్జ్ పోస్ట్ ఇస్తారని..ఆయన దూకుడుతో పార్టీని పటిష్టం చేసేలా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది.సామాజిక సమీకరణాలతో పాటు, ఈ సారి కొత్త ఇంచార్జ్‌ల ఎంపికలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని జనసేన అధినేత భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆచంట, తణుకు నియోజకవర్గాల్లోనూ కొత్త ఇంచార్జ్‌ల నియామకంపై జన సైనికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే పనితీరు బాగున్న వారికే పట్టం కట్టాలని పవన్ గట్టి పట్టుదలతో ఉన్నారట. ఇంచార్జ్‌ల మార్పునకు ప్రధానంగా రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారట. ఒకటి నియోజకవర్గంలో వారి పనితీరు, రెండోది సభ్యత్వ నమోదులో చూపిన చొరవ. ఎవరు పార్టీ కోసం కష్టపడి జనాల్లోకి వెళ్తున్నారో వారికే బాధ్యతలు దక్కనున్నాయనే ప్రచారం జరుగుతుంది.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఉన్న పరిస్థితులను, ఇంచార్జ్‌ల మార్పు అవసరాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. పవన్ కల్యాణ్ స్వల్ప అనారోగ్యంతో ఉన్నప్పటికీ, పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఈ కూర్పుపై సీరియస్‌గా చర్చిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న జనసేన, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తన సత్తా చాటాలని భావిస్తోంది. ఈ ప్రక్షాళన ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపి, క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చడమే పవన్ అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ కొత్త ఇంచార్జ్‌ల జాబితాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# తల్లికి వందనం పథకం

# 78 లక్షల మంది అర్హులు

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఏడాది సుమారు 78 లక్షల మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించింది ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం నిధులు మరికొన్ని రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితా రూపకల్పన, నగదు జమ ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఉన్నత లక్ష్యంతో సాగుతున్న ఈ పథకం ద్వారా ఈ ఏడాది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక ఊరట కలగనుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 78 లక్షల మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి ప్రాథమికంగా అర్హులుగా తేల్చారు. పాఠశాలల నుంచి సేకరించిన విద్యార్థుల డేటాను ఇప్పటికే క్రోడీకరించి, తుది వడపోత కోసం క్షేత్రస్థాయి అధికారులకు పంపారు. ప్రస్తుతం గ్రామ, వారు సచివాలయాల్లోని సంక్షేమ కార్యదర్శులు ఈ వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈతనిఖీ ప్రక్రియలో భాగంగా, విద్యార్థుల హాజరు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, ఇతర అర్హత ప్రమాణాలను సరి చూస్తున్నారు. అనర్హులను తొలగించి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఈపరిశీలన సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే అర్హుల తుది జాబితాను విడుదల చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదును విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాలలకు వెళ్లడం మానేయకూడదనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేలా ప్రోత్సహించడానికి, వారి విద్యా అవసరాల కోసం ప్రభుత్వం నేరుగా తల్లుల ఖాతాల్లోనే నగదును జమ చేస్తోంది. రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి, డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించడానికి తీసుకున్న ఒక సామాజిక విప్లవం. తల్లికి వందనం నిధులు ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నేరుగా ఖాతాల్లో జమ కావాలి అంటే లబ్ధిదారులు కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మీ బ్యాంకు ఖాతా యాక్టివ్‌గా ఉంచుకోవాలి. అలా ఉందో లేదో చూడాలి. చాలా కాలం నుంచి లావాదేవీలు జరపని ఖాతాలు ఇన్ యాక్టివ్ అయ్యే అవకాశం ఉంది. విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాకు ఆధార్ నెంబర్ తప్పనిసరిగా లింక్ అయ్యి ఉండాలి. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కీలకమైన అంశం. ప్రభుత్వపథకాల నగదు డైరెక్ట్‌గా బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందాలంటే, ఖాతాకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తి అయి ఉండాలి. పాఠశాల రికార్డుల్లో, సచివాలయ డేటాలో విద్యార్థి, తల్లి వివరాలు ఒకే విధంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ వివరాలను లేదా ఎన్‌పీసీఐ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో లేదా స్థానిక గ్రామ వార్డు సచివాలయంలో చెక్ చేసుకోవచ్చు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం ఏపీ ప్రభుత్వం సుమా3రు రూ. 8, 711 కోట్లను విద్యార్థుల కుటుంబాల ఖాతాల్లో జమ చేసింది. ఈ భారీ మొత్తం రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించింది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో లేదా అంత కంటే ఎక్కువ మొత్తంలో నిధుల విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.


# స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు



విజయవాడ,: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. కొత్త ఎస్ఈసీ అనిల్ కుమార్ పునేఠా నిర్వహించిన సమీక్షా సమావేశం రాష్ట్రంలో ఎన్నికల వేడిని ఒక్కసారిగా పెంచింది. వచ్చే మూడు నెలల కాలంలో పెండింగ్‌లో ఉన్న పంచాయతీ, పరిషత్ , మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏకపక్ష ఎన్నికల ఆరోపణల కారణంగా , ఈసారి అత్యంత పారదర్శకంగా ఎన్నికలు జరపాలని యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది.స్థానిక ఎన్నికల నిర్వహణ కూటమి ప్రభుత్వానికి అంత సులభం కాదు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అద్భుత విజయం సాధించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు ఇప్పుడు అతిపెద్ద సవాల్‌గా మారింది. ముఖ్యంగా జనసేన, బీజేపీలు ఈసారి గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పట్టుబట్టే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా తమకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీల కిందిస్థాయి నేతలు ఇప్పటికే ఒత్తిడి పెంచుతున్నారు. ఐదేళ్లుగా క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని నిలబడిన టీడీపీ గ్రామస్థాయి కార్యకర్తలు.. ఇప్పుడు తమకు రావాల్సిన పదవులను పొత్తుల పేరుతో ఇతర పార్టీలకు వదులుకోవాల్సి వస్తుందన్న ఆందోళనలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన నెట్‌వర్క్ ఉన్న టీడీపీ క్యాడర్‌ను కాదని జనసేన లేదా బీజేపీకి ఎక్కువ స్థానాలు కేటాయిస్తే, అది తిరుగుబాటుకు దారితీయవచ్చు. ఇదే జరిగితే కూటమి ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉందని చంద్రబాబు నాయుడు గ్రహించారు.ఎన్నికల నిర్వహణపై ప్రకటనలు వస్తున్నప్పటికీ, లోలోపల చంద్రబాబు కొంత జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం పార్టీల మధ్య సమన్వయం కుదర్చడమేనని తెలుస్తోంది. ముందుగా నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను వేసి, అసంతృప్తిని తగ్గించిన తర్వాతే నోటిఫికేషన్‌కు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. అందుకే ఎస్ఈసీ కసరత్తు చేస్తున్నా, ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన ఈసారి స్థానిక సంస్థల్లో తన బలాన్ని నిరూపించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో తమకు గౌరవప్రదమైన సంఖ్య దక్కాలని ఆ పార్టీ కోరుతోంది. అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఏపీలో తన ఉనికిని చాటుకోవడానికి ఈ ఎన్నికలను వేదికగా మార్చుకోవాలని చూస్తోంది. ఈ మూడు పార్టీల డిమాండ్లను సమతూకం చేయడం చంద్రబాబుకు కత్తిమీద సాము లాంటిదే. వచ్చే మూడు నెలలు ఏపీ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి. అటు వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం కంటే, ఇటు కూటమిలోని పార్టీల మధ్య సఖ్యతను కాపాడుకుంటూ సీట్ల పంపిణీ పూర్తి చేయడమే చంద్రబాబు ముందున్న ప్రధాన లక్ష్యం. ఒకవేళ ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని చోట్ల 'ఫ్రెండ్లీ కాంటెస్ట్ జరిగే అవకాశాలను కూడా తోసిపుచ్చలేం.

### జననాల రేటు తగ్గడానికి స్మార్ట్ ఫోన్‌లూ కారణమే..


# పలు అధ్యయనాల్లో వెల్లడి..!



ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల తీరు మందగించింది. మూడు దశాబ్దాల క్రితం భారత్ లో ఒక మహిళ సగటున 3.4 మంది పిల్లలకు జన్మనిచ్చేది. కానీ ఇప్పుడు ఆ సంఖ్య 2.0 కి పడిపోయింది. ఇది జనాభా స్థిరంగా ఉండటానికి అవసరమైన 2.1 కంటే తక్కువ. అయితే ఈ ధోరణి కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో జననాల రేటు తీవ్రంగా పడిపోతున్నది. కొన్ని దేశాల్లో అయితే మహిళలు సగటున ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వడం లేదు. పెరుగుతున్న జీవన వ్యయం, ఖరీదైన గృహ వసతి, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, కెరీర్‌పై ఒత్తిడి, మారుతున్న సామాజిక పోకడలు లాంటివే సంతానలేమికి కారణాలని ఇప్పటివరకు అంతా భావించారు. కానీ ఇటీవలి కాలంలో పరిశోధకులు మరో కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చారు. అదే స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం..! స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టాబ్‌లు మొదలైన టెక్నాలజీ మానవ సంబంధాలను మార్చిపారేస్తున్నది. ఈ మార్పే పిల్లల్ని కనే వారి సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. సిన్సినాటి విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నాన్ మోస్కోసో-బోడో ఇటీవల అమెరికా, బ్రిటన్‌లలో 4జీ మొబైల్ ఇంటర్నెట్ రాకకు, జననాల రేటుకు మధ్య ఉన్న సంబంధంపై అధ్యయనం చేశారు. హై-స్పీడ్ మొబైల్ కనెక్టివిటీ ముందుగా వచ్చిన ప్రాంతాల్లో జననాల రేటు వేగంగా తగ్గినట్టు వారి పరిశోధనలో తేలింది. స్మార్ట్‌ఫోన్లు యువత ఒకరితో ఒకరు గడిపే విధానాన్ని ప్రాథమికంగా మార్చేశాయని, ముఖాముఖిగా కలుసుకోవడం తగ్గి, ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడంవల్ల సంతానోత్పత్తిపై ప్రభావం పడి ఉండవచ్చని వారు విశ్లేషించారు. ఫైనాన్షియల్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం కూడా అనేక దేశాల్లో స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విస్తృతమైన తర్వాతే జననాలరేటు గణనీయంగా క్షీణించడం ప్రారంభమైంది. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా వినియోగించే యువతలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంది. ఫిన్లాండ్‌కు చెందిన జనాభా నిపుణురాలు అన్నా రోట్‌కిర్చ్ ప్రకారం.. యువతలో సోషల్ మీడియా వాడకం పెరగడంవల్ల జంటల మధ్య లైంగిక సమస్యలు కూడా పెరుగుతున్నాయని తెలుస్తోంది. సోషల్ మీడియాలో కనిపించే ఆడంబరమైన జీవనశైలి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఇతరులతో పోల్చుకోవడం వంటివి యువతలో అభద్రతా భావాన్ని, అస్థిరతను పెంచుతున్నాయని, దీనివల్ల వారు పిల్లల్ని కనేందుకు సిద్ధపడటం లేదని ఆమె వాదిస్తున్నారు. గతంలో టీవీ సీరియళ్లలో చిన్న కుటుంబాలను చూసి మహిళలు తక్కువ మంది పిల్లల్ని కన్నట్టు కొన్ని అధ్యయనాలు తెలిపాయి. ఇప్పుడు టీవీ కంటే ఎన్నో రెట్లు ప్రభావవంతమైన స్మార్ట్‌ఫోన్లు ఈ మార్పును మరింత వేగవంతం చేస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

# కిడ్నీలను కాపాడుకుందాం

2026లో వాతావరణం.. సాధారణం కంటే అధిక వేడిగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలో వడగాలుల ప్రభావం కూడా ఎక్కువే ఉండనున్నది. అయితే, వేడి గాలులు కిడ్నీల ఆరోగ్యాన్ని దెబ్బతీయస్తాయని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పరిశోధకులు.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 78.8 కోట్ల మంది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నారని తేల్చింది. మన దేశం విషయానికి వస్తే.. 13.8 కోట్ల మందిలో కిడ్నీ సమస్యలు ఉన్నాయట. ఈ క్రమంలో హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్.. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది. మన శరీరంలో కిడ్నీలు చాలా కీలకమైన పనులు నిర్వహిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా, శరీర సమతుల్యతను కాపాడతాయి. రక్తం నుంచి వ్యర్థ పదార్థాలను బయటికి పంపిస్తాయి. శరీరంలో నీటి శాతాన్ని క్రమబద్ధీకరిస్తాయి. రక్తపోటు నియంత్రణ, ఎముకల ఆరోగ్యం, ఎర్రరక్త కణాల ఉత్పత్తిలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, తీవ్రమైన వేడి.. సున్నితమైన కిడ్నీల వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తుంది. ఫలితంగా, మూత్రపిండాల పనితీరు మందగించి.. ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇటీవలి కొన్ని అధ్యయనాలు బహిరంగ కార్మికులలో అధిక శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాయి. ఎక్కువ సమయంపాటు వేడికి గురవ్వడం, ఒత్తిడితోపాటు రీహైడ్రేషన్ లేకపోవడమే వారిలో కిడ్నీల సమస్యకు కారణమని నిపుణులు వెల్లడించారు. కాబట్టి, ఎండలు ముదరక ముందే.. కిడ్నీలను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.




దాహం వేసినప్పుడే కాకుండా.. సమయానుకూలంగా నీళ్లు తాగాలి. అప్పుడే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో పనులు చేసేవాళ్లు.. ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మకాయ షర్బత్, ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. శరీరం కోల్పోయిన లవణాలను భర్తీ చేయడానికి ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. నీటి శాతం అధికంగా ఉండే ఆహార ఉత్పత్తులను తీసుకోవాలి. పుచ్చకాయ, కర్బూజా, ద్రాక్ష, దోసకాయ, సొరకాయ వంటివి ఎక్కువగా తినాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అధిక ప్రొటీన్ కలిగిన భోజనాన్ని నివారించాలి.

ఎందుకంటే.. ప్రొటీన్ శరీరంలోనీటి నష్టాన్నిపెంచుతుంది. మూత్రపిండాలను మరింత ఒత్తిడికి గురి చేస్తుంది. టీ/కాఫీలతోపాటు ఆల్కహాల్ తీసుకోవడం తగ్గించాలి. శరీరం వేడెక్కినట్లు అనిపిస్తే.. పాదాలను చల్లటి నీటిలో ముంచాలి. దీనివల్ల కోర్ ఉష్ణోగ్రత వేగంగా తగ్గుతుంది. వాతావరణం మారుతున్న కొద్దీ.. ఆరోగ్య వ్యూహాలను కూడా మార్చాలి. అప్పుడే మూత్రపిండాలు క్షేమంగా ఉంటాయి.

# సీఎంలతోనే హోంశాఖలు

హైదరాబాద్, : ఈ దేశంలో కొత్త ట్రెండ్ పాలనలో సాగుతోంది. ముఖ్యమం త్రులే హోం వంటి పవర్ ఫుల్ శాఖలను స్వయంగా చూస్తున్నారు. నిజానికి రాష్ట్రాలలో కానీ కేంద్రంలో కానీ కీలకమైన శాఖగా నంబర్ టూగా హోం శాఖ ఉంటుంది. లా అండ్ ఆర్డర్ తో ముడి పడి ఉన్న ఈ శాఖ ఎంతో ఇంపార్టెంట్ గా ఉంటుంది. రాజకీయంగా కూడా ఈ శాఖకు ఉన్న గ్లామర్ వేరుగా ఉంటుంది. ఒక విధంగా చెప్పాలీ అంటే హోం మంత్రి అంటే వెయిటింగ్ చీఫ్ మినిస్టర్ అని గతంలో చెప్పుకునే వారు. సీనియర్ మోస్ట్ లీడర్ కి ఈ శాఖ కట్టబెట్టేవారు. అయితే మారిన ట్రెండ్ లో చూస్తే ముఖ్యమంత్రులే ఇంతటి బరువైన శాఖను చూస్తున్నారు. తామే ఆ భారాన్ని మోస్తున్నారు. ముందే చెప్పినట్లుగా లా అండ్ ఆర్డర్ ఇపుడు రాజకీయాలను ప్రభుత్వాల తలరాతను శాసిస్తోంది. దాంతో పాటు ప్రభుత్వంలో నంబర్ టూ గా వేరెవరికో చాన్స్ ఇచ్చి తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకు అదేదో వన్ టూ రెండూ తామే ఉ ండాలన్న ఆలోచన కూడా ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తోంది. అందులే దేశంలో సగం రాష్ట్రాలలో ముఖ్యమంత్రులే హోం మంత్రులుగా ఉ ంటున్నారు. దళపతిగా వెండి తెరను ఏలిన విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక కీలక శాఖలను మంత్రులకు కేటాయించారు. ఆయనతో పాటు తొమ్మిది మంది మాత్రమే ఈ నెల 10న ప్రమాణం చేశారు. వారందరికీ తాజాగా ఆయన శాఖలు ప్రకటించారు. అందులో కీలకమైన హోం శాఖను విజయ్ తన వద్దనే ఉంచుకోవడం విశేషం. దాంతో ఆయన హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ప్రత్యక్ష బాధ్యతలను స్వయంగా నిర్వహించనున్నారు. ఒక విధంగా ముఖ్యమంత్రిగా బాధ్యలతో పాటు హోం శాఖ కూడా కీలకమే కానీ విజయ్ మాత్రం ప్రతిష్టగా తీసుకుని తమిళనాడులో లా అండ్ ఆర్డర్ కి తానే పూర్తి బాధ్యత వహించాలని అనుకుంటున్నారు. : ఇక తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయితే మొదటి నుంచి తన వద్దనే హోం శాఖను ఉంచుకున్నారు. తెలంగాణా కాంగ్రెస్ లో ఎంతో మంది సీనియర్లు ఉన్నారు. కానీ ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తితో శ్రద్ధతో ఈ శాఖను రెండున్నరేళ్ళుగా చూస్తున్నారు. ఆయన స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ రాష్ట్రంలోని శాంతిభద్రతలు సాధారణ పరిపాలన విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. అలా గట్టి హోం మంత్రిగానే పేరు తెచ్చుకున్నారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మహారాష్ట్ర హోం మంత్రిగానూ కొనసాగుతున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా తన విధులతో పాటు ఈ పదవిని కూడా నిర్వహిస్తున్నారు. ఒక చాలెంజ్ గా ఆయన స్టేట్ లో లా అండ్ ఆర్డర్ ని నడిపిస్తున్నారుమమతా బెనర్జీని దించేసి పశ్చిమ బెంగాల్ కి తొమ్మిదవ ముఖ్యమంత్రిగా తాజాగా ప్రమాణం చేసిన సువేందు అధికారి హోం మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన రాష్ట్ర హోం కొండ ప్రాంతాల వ్యవహారాల విభాగ శాఖలను చూస్తున్నారు. బెంగాల్ లో లా అండ్ ఆర్డర్ కత్తి మీద సాము లాంటిది. దాంతో పాటు ఢీ అంటే ఢీ గా రాజకీయం సాగుతుంది. దాంతో సువేందు అధికారి ఈ అతి ముఖ్య బాధ్యతలను తానే భుజాల మీద వేసుకున్నారు. మంత్రి షేర్ చేసిన క్రేజీ వీడియో వైరల్ ఇక దక్షిణాన కేరళం రాష్ట్రానికి నిన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన పినరయి విజయన్ మొదటి రెండవ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు రెండింటిలోనూ హోం మంత్రిగా తానే పనిచేశారు. ఆయన హోం శాఖతో పాటు సాధారణ పరిపాలన, నిఘా సమాచార సాంకేతిక శాఖలను కూడా తన వద్దే ఉంచుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపారు. ఇదే తీరున చూస్తే మధ్యప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రి ఎవరూ లేరు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఉత్తర ప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రిని తీసుకోలేదు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తున్నారు. వీరంతా అదే దారిలో : అంతే కాదు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రస్తుతం హోం వ్యవహారాలు న్యాయ శాఖలను నిర్వహిస్తున్నారు. ఆయన మార్చి 2022 లో మంత్రివర్గాన్నిఏర్పాటు చేసినప్పటి నుంచి హోం మంత్రిత్వ శాఖ తన వద్దనే ఉంచుకున్నారు. బీహార్ కి కొత్త ముఖ్యమంత్రి అయిన సామ్రాట్ చౌదరి హోం, సాధారణ పరిపాలన, క్యాబినెట్ సెక్రటేరియట్, విజిలెన్స్, పౌర విమానయానం, ఎన్నికలు వంటి కీలకమైన, అత్యంత ప్రాధాన్యత గల పోర్ట్‌ఫోలియోలను పర్యవేక్షిస్తున్నారు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో ఇతర క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేకంగా కేటాయించని అన్ని శాఖలను కూడా ఆయన తన వద్దే ఉంచుకున్నారు. ఇలా అనేక మంది ముఖ్యమంత్రులు హోం శాఖ తమ వద్దనే ఉంచుకున్నారు.

# అయ్యో... ఆక్వా



ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడుతోంది. తన పరిధిలోని సమస్యల పరిష్కారానిక్కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మోదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది ఎ.పి.లోని రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20-30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ ఇస్తున్న టిడిపి గట్టిగా కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. శనివారం సర్కార్ నిర్వహించిన ఉమ్మడి సమావేశంలో కిలోకు రూ.31 వరకు పెంచాలని కంపెనీలు డిమాండ్ చేశాయి. రైతులు ససేమిరా అంగీకరించలేదు. బంతి సిఎం కోర్టుకు చేరింది.

రాష్ట్ర విభజన తర్వాత ఆక్వా, అందులోనూ రొయ్యల సాగు విస్తరణకు టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలతో అధిక ప్రాధాన్యమిచ్చాయి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. ఆక్వా రైతు శ్రేయస్సు దృష్ట్యా మోడీ సర్కార్ అమెరికాపై ఒత్తిడి తెచ్చి సుంకాలు తగ్గించాలి. 'పెట్రో' ఛార్జీలు తగ్గించాలి. అందుకు టిడిపి కూటమి సర్కార్ కేంద్రంపై ఒత్తిడి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాలి.

# సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు.

ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు.

ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళు తుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

## రోడ్డెక్కిన రైతులు.. వరి ధాన్యం బస్తాలకి నిప్పు

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లాలో ఎక్కడ చూసినా వరి ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయి. రైతుల ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్ యార్డుతో పాటు కొనుగోలు సెంటర్ల దగ్గర పడిగాపులు కాస్తూ ఎన్నో కష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం విషయంలో తన మొండివైఖరిని విడలని రైతులు కోరుతున్నారు. వనపర్తి మండలం రాజపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని వనపర్తి నుండి కొత్తకోటకు వెళ్లే రోడ్డుపై వరి ధాన్యం పోసి ధాన్యానికి నిప్పు పెట్టి ధర్నా నిర్వహించిన రైతులు.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 45 రోజులు అవుతున్నా ఒక్క బస్తా తూకం చేయడం లేదని రైతులు కన్నెర్ర చేశారు. అనంతరం రాజపేట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వరి ధాన్యం బస్తాలను రోడ్డు పైకి తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా వేసి ఖాళీ బస్తాలకు నిప్పంటించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాస్తారోకోలో సింగల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, ఉప సర్పంచ్ చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాములు, నాయకులు సుదర్శన్ రెడ్డి, మాధవ రెడ్డి, రైతులు తిరుపతయ్య, తెలుగు నారాయణ, మోహన్ రెడ్డి, సత్యా రెడ్డి, శంకర్ రెడ్డి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పిఠాపురం పెద్దన్న పవనే..



కాకినాడ: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధి గానే కాకుండా.. తన రాజకీయానికి హ్యూమన్ టచ్ ఇస్తున్నారు. పిఠాపురం మొత్తాన్ని ఆత్మీయ కుటుంబంగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా ప్రతినిధి పాత్రకు భిన్నంగా, ఆయన అక్కడ ఒక కుటుంబానికి పెద్దన్న తరహాలో ప్రతి ఇంటి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా, నియోజకవర్గంలోని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో భరోసా కల్పిస్తూ, ఒక పెద్దన్న తన కుటుంబం పట్ల చూపే బాధ్యతను ఆయన నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఆయన చూపిస్తున్న శ్రద్ధ అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. పదో తరగతిలో అత్యు త్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు లేని చిన్నారులకు భగవంతునిబిడ్డలు అని పేరు పెట్టి తన సొంత జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఒక తండ్రి తన పిల్లల చదువు కోసం ఎలాగైతే తపన పడతారో, పవన్ కళ్యాణ్ గారు కూడా పిఠాపురం విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్నారు. విద్యా సంస్థలను ఒప్పించి ఉచిత అడ్మిషన్లు ఇప్పించడం ద్వారా ఒక తరం భవిష్యత్తును ఆయన తీర్చిదిద్దుతున్నారు.సంక్షేమ పథకాలను కేవలం ప్రభుత్వ ఫైళ్లకు పరిమితం చేయకుండా, పండుగ వచ్చిందంటే పిఠాపురంలోని ప్రతి ఆడబిడ్డకు తన తరఫున చీరలు పంపడం, కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలవడం ఆయనకు అలవాటుగా మారింది. ఉపాధ్యాయుల సమస్యలైనా, సామాన్యుల ఆరోగ్య అవసరాలైనా పవన్ ఉన్నారు అనే ధీమా ఇప్పుడు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. క్షే జలు ఆయనను ఒక నాయకుడిలా కంటే, తమ ఇంటి పెద్ద దిక్కులా భావించి కష్టాలు చెప్పుకుంటున్నారు. వాటిని ఆయన పరిష్కరిస్తున్నారు.పిఠాపుం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్ గా మార్చే క్రమంలో పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ఈ వ్యక్తిగత సహాయ ? సామాజిక బాధ్యత ఫార్ములా ఒక సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికింది. నియోజకవర్గవ్యాప్తంగా 580 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తికి అనుగుణంగా నచ్చిన కోర్సుల్లో చేర్పించే బాధ్యతను పవన్ కళ్యాణ్ స్వయంగా చేపట్టారు. వీరిలో రాష్ట్రస్థాయిలో 598 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కూడా ఉన్నారు.ఇప్పటికే తల్లిదండ్రులు లేని పిల్లలకు తన జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న ఆయన, ఇప్పుడు ఈ విద్యా సాయం ద్వారా మరో ముందడుగు వేశారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, విద్యార్థుల కెరీర్ పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో పలు ప్రముఖ విద్యా సంస్థలు ఈ 31 మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. విద్యార్థులు ఏ కాలేజీలో చదవాలనుకుంటున్నారో, ఏ కోర్సుపై వారికి ఆసక్తి ఉందో తెలుసుకొని, సంబంధిత యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి ఈ అవకాశాన్ని కల్పించారు.తన పిలుపును గౌరవించి విద్యార్థులకు బాసటగా నిలిచిన విద్యా సంస్థలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నాయకులు హామీలు ఇవ్వడం సహజం, కానీ ఇచ్చిన హామీలను దాటి తన వ్యక్తిగత చొరవతో, సొంత జీతంతో ప్రజలకు సాయం చేయడం పవన్ కళ్యాణ్ ప్రత్యేకతను చాటుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ఆయన చూపిస్తున్న ఈ ఆదరణ కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రజాప్రతినిధులకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. సామాన్య విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్న పవన్ కళ్యాణ్ పిఠాపురం వాసుల మనసు గెల్చుకుంటున్నారు.అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడం ఒక ఎత్తు అయితే, తన వ్యక్తిగత ఆదాయాన్ని ప్రజల కోసం ఖర్చు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. పిఠాపురం ప్రజల పట్ల ఆయన చూపిస్తున్న ఈ వాత్సల్యం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ఒక ఆత్మీయ అనుబంధంగా మారుతోంది.

# మగవాళ్లకూ తప్పని వేధింపులు..?

ఢిల్లీ.: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, మతమార్పిడి ప్రయత్నాలకు సంబంధించిన వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు తమ అధికారాన్ని ఉపయోగించుకుని మహిళా ఉద్యోగులను మాత్రమే కాదు, పురుష ఉద్యోగులను కూడా మానసికంగా హింసించారని, బలవంతపు మత మార్పిడులకు ఒత్తిడి చేశారని బయటపడింది. తాజాగా ఒక పురుష ఉద్యోగి తనకు ఎదురైన భయంకరమైన అనుభవాలను బయటపెట్టారు. తనతో బలవంతంగా 'స్కల్ క్యాప్' (టోపీ) ధరింపజేసి, నమాజ్ చేయించారని ఆయన ఆరోపించారు. అంతటితో ఆగకుండా, నిందితుల్లో ఒకరు తన వ్యక్తిగత జీవితంపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ 'పిల్లలు కావాలంటే నీ భార్యను నా దగ్గరకు పంపు' అని అన్నట్లు పేర్కొన్నారు. తన టీమ్ లీడర్లు తనతో బలవంతంగా నమాజ్ చేయించారని, కల్మా చదివించారని, స్కల్ క్యాప్ ధరింపజేశారని ఆ బాధితుడు ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు. వైద్య చికిత్స పొందుతు న్నప్పటికీ తన భార్యకు పిల్లలు కలగడంలేదన్న విషయంపై నిందితులు ఎగతాళి చేస్తూ, అత్యంత దారుణమైన మరియు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో తాను కంపెనీలో చేరగా.. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే వేధింపులు మొదలయ్యాయని ఆయన తెలిపారు. తన టీమ్ లీడర్ తౌసిఫ్ అక్తర్, సహోద్యోగి డానిష్ షేక్ తనను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. టీమ్ లీడర్ గా ఉన్న తౌసిఫ్.. తన మాట వినేలా చేయడానికి ఇతరుల పనిని కూడా తనపై వేసి, శారీరకంగా, మానసికంగా అలసిపోయేలా చేసేవాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఫిర్యాదులపై నాసిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జగన్ మావిగన్ యూ టర్న్...

విజయవాడ, : ఏపీ రాజకీయాల్లో ఒకప్పుడు మూడు రాజధానుల మంత్రం పఠించిన వైసీపీ హఠాత్తుగా మావిగన్ అనే ఊహాజనిత రాజధానిని ప్రకటించింది. జగన్ రెడ్డి ప్రకటించిన ఆ రాజధాని కాస్తా ఇప్పుడు ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది. అమరావతికి పోటీగా అత్యంత ఖర్చు తక్కువతో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయవచ్చని అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించినా, అది క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందకపోగా.. తీవ్ర స్థాయిలో ఎకసెక్కాలకు గురవుతోంది. సోషల్ మీడియాలో వస్తున్న సెటైర్లు, విమర్శలకు సమాధానం చెప్పుకోలేక ఇప్పుడు వైసీపీ శ్రేణులు ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి.అమరావతిని అవినీతి గనిగా అభివర్ణిస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మావిగన్ మోడల్‌ను తెరపైకి తెచ్చినప్పుడు వైసీపీ నేతలు ఆకాశమే హద్దుగా మాట్లాడారు. కానీ, అది కేవలం ఒక ఊహాజనిత పదంగానే మిగిలిపోయిందని, దానికి ఎలాంటి శాస్త్రీయ పునాది లేదని మేధావుల నుంచి వచ్చిన విమర్శలతో ఆ పార్టీ డిఫెన్స్‌లో పడింది. అసలు మావిగన్ అనే పేరు వినగానే జనాల్లో వస్తున్న నవ్వులు చూశాక, ఈ అంశంపై చర్చ పెడితే పరువు పోవడం ఖాయమని గ్రహించిన నేతలు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రోజా వంటి వారు సైతం ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలు ఒక్కటే కదా అంటూ సర్దుబాటు మాటలు మాట్లాడుతుండటం ఆ పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చి, నిధులు కూడా మంజూరు చేస్తున్న తరుణంలో మావిగన్



ప్రస్తావన వైసీపీకి సెల్ఫ్ గోల్‌లా మారింది. ఒకవైపు అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతుంటే, కేవలం ప్లాన్-బి అంటూ లేని కారిడార్ గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని ఆ పార్టీకి ఆలస్యంగా జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు మేధావులతో చర్చలు లేవు, సోషల్ మీడియాలో పోస్టులు లేవు. కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన ఈ మావిగన్ సిద్ధాంతాన్ని జనం మరిచిపోయేలా చేయడమే ఇప్పుడు వైసీపీ ముందున్న ఏకైక మార్గంలా కనిపిస్తోంది.అమరావతిని దెబ్బకొట్టాలని తీసిన మావిగన్ అస్త్రం తిరగబడి సొంత పార్టీకే తగిలింది. రాజకీయంగా మైలేజ్ వస్తుందని ఆశించిన ఈ కాన్సెప్ట్ కాస్తా, ఇప్పుడు కేవలం మీమ్స్‌కు మాత్రమే పరిమితం కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు గన్ తీసి పక్కన పెట్టి, మళ్ళీ పాత సంక్షేమ రాగాన్నే అందుకోవాలని చూస్తున్నారు.

# ఘర్ వాపసీ కష్టాలు


నెల్లూరు : వైసీపీ నుంచి చాలా మంది నేతలు గత రెండేళ్ళుగా బయటకు పోయారు, వివిధ కారణాలతో అనేక మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. ఫ్యాన్ నీడన తమకు ఉక్కబోతగా ఉందని చెప్పి మరీ తలాఖ్ అనేశారు. వైసీపీలో ఏళ్ళ తరబడి పనిచేసిన వారు పునాదుల నుంచి ఉన్న వారు వైఎస్సార్ కుటుంబంతో తరాలుగా పనిచేస్తున్న వారు కూడా పార్టీ గేటు దాటారు. ఇదంతా ఒక విధంగా ఆశ్చర్యంగా సాగింది. రాజకీయాల్లో ఇవన్నీ మామూలు అయినా ఏ పార్టీకి అయినా మొదటి నుంచి ఉన్న వారు కొనసాగుతారు. అయారాం గయారాం ల విషయం అందరికీ ఎరుకే. కానీ పునాదుల నుంచి ఉన్న వారే వెళ్ళి పోవడం అంటే అది వైసీపీకి కలవరం కలిగించే అంశమే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి.వైసీపీలో జగన్ తరువాత నంబర్ టూ అనిపించుకున్న విజయసాయిరెడ్డి పార్టీని వీడుతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు, ఆయన పార్టీ నుంచి చాలా సైలెంట్ గా నిష్క్రమించారు. అలాగే వైసీపీతోనే సర్వం అనుకున్న మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ల నాని, సామినేని ఉదయభాను, జగన్ బంధువు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంటి వారు చాలా సులువుగా బంధాలను తెంపుకుని బయటకు వెళ్ళారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీల జాబితా చూస్తే చాలానే ఉంది. అంతవరకూ ఎందుకు ఎమ్మెల్సీలుగా ఇంకా చేతిలో అధికారం ఉన్నా కూడా వైసీపీ వద్దు అని పదవులు సైతం వదులుకుని వెళ్ళిన వారూ ఉన్నారు. అయితే వీరంతా వైసీపీ భారీ ఓటమికి సంబంధించిన బాధలోనో లేక కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి సొంత ఇబ్బందుల వల్లనో వెళ్ళారని అంతా అనుకున్నారు. వైసీపీ అధినాయకత్వం కూడా అలాగే భావించి కొన్నాళ్ళకు అయినా వారంతా రిటర్న్ అవుతారు అని ఊహించింది. అయితే ఇతర పార్టీలలో చేరి ఇబ్బందులు పడుతున్నా తాము వైసీపీలోకి తిరిగి వెళ్లేది లేదని చాలా మంది నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు అంటే వైసీపీ అంటే వారికి ఎంతటి వెగటు పుట్టిందో అర్థం కావడం లేదని అంటున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా దిగ్గజ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే తాను ఎట్టి పరిస్థితిల్లోనూ వైసీపీ గడప తొక్కేది లేదని అన్నారు. తన భవిష్యత్తు అంతా జనసేనలోనే అని క్లారిటీ ఇచ్చారు. అయినా తనను టార్గెట్ చేసి తాను వైసీపీలోకి వస్తున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు అని మండిపడ్డారు. తాను జనసేనలో ఒక వేళ ఇబ్బంది పడినా వైసీపీకి వచ్చిన నొప్పి ఏంటని బాలినేని ప్రశ్నించారు. వైసీపీ నుంచి వెళ్ళిన మరో కీలక నేత విజయసాయిరెడ్డి వీలైనపుడల్లా వైసీపీని విమర్శిస్తూనే ఉన్నారు. వైసీపీ అధికారంలోకి రావడం కష్టమని ఆయన జోస్యం చెబుతూ వస్తున్నారు. అంతే కాదు వైసీపీకి ఏపీని ఏలా అభివృద్ధి చేయాలో విజన్ లేదని లేటెస్ట్ గా ఆయన హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో టీడీపీకి వైసీపీకి ఆల్టర్నేషన్ గా థర్డ్ ఫోర్స్ రావాలని కూడా ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. ఇదే విషయం పదే పదే చెబుతున్నారు. దాంతో విజయసాయిరెడ్డి ఇదిగో అదిగో వచ్చేస్తున్నారు అని జరుగుతున్న ప్రచారం అంతా ఒట్టిదే అని అంటున్నారు. ఇక ఇదే తీరున అనేక మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని అంటున్నారు. వీరంతా తమకు ఇతర పార్టీలలో చాన్స్ లేకపోయినా ఓకే కానీ తిరిగి వైసీపీలోకి వెళ్ళమని అంటున్నారు అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. వైసీపీ ఓటమి తరువాత పార్టీని పటిష్టం చేయాలని చూస్తోంది. చాలా చోట్ల పాత కాపులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. దాంతో అనుభవం ఉన్న వారు గతంలో పార్టీలో పనిచేసిన వారు వస్తే ఘర్ వాపసీ కింద ఓకే చెబుతారు అన్న ప్రచారంఉంది. మరి వైసీపీలోకి వచ్చే నాయకులు ఎవరు అన్నదే చర్చగా ఉంది. చిత్రమేంటి అంటే చాలా మంది ఏ పార్టీలో చేరకుండా వెయిట్ చేస్తున్నారు మరి వీరిలో ఎవరైనా తిరిగి వైసీపీ వైపు వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్..

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి.ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది. తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్ర స్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లు వాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకు ఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్ గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది.ఈ ప్రక్షాళనలో కేవలం పనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేసే క్రమంలో సామాజిక సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. ఏఐసిసి ఇచ్చే లీకులు, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే తుది జాబితా ఉంటుందని స్పష్టమవుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం వారిలో నిద్రలేకుండా చేస్తోంది.మొత్తానికి తెలంగాణ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పు మాత్రమే కాదు, ఇది రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే ఒక వ్యూహాత్మక చర్య. ఒకవైపు పదవులు ఊడతాయనే వణుకు, మరోవైపు కొత్త శాఖలు దక్కుతాయనే ఆశల మధ్య తెలంగాణ రాజకీయం ఇప్పుడు వెయిట్ అండ్ వాచ్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. హైకమాండ్ తీసుకునే నిర్ణయం ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాన్ని ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

# గ్రేటర్ సిటీలుగా విజయవాడ, తిరుపతి

విజయవాడ, : ఏపీలో రెండు నగరాలు గ్రేటర్ సిటీలుగా మారనున్నా యి. విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదా రానుంది. ఈ రెండు నగరాల్లో 138 పంచాయతీల విలీన ప్రతిపాదనల్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నంలో మరో 63 పంచాయతీలను చేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు గ్రామాల విలీనానికి సంబంధించి అంశంపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రెండు నగరాలను 'గ్రేటర్' హోదాకు మార్చబోతోంది. విజయవాడ, తిరుపతి నగరాల గ్రేటర్ ప్రతిపాదనలకు సంబంధించి మరో అప్డేట్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం రెండు నగరాల విస్తీర్ణం పెంచేందుకు.. 10 మండలాల్లోని 138 గ్రామ పంచాయతీలను విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోకి మరో 64 పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో జనగణన పూర్తయ్యేలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ నగరాల ప్రతిపాదనలపై ఇప్పటికే నిర్ణయం తీసుకోవాల్సింది కానీ జనగణన కారణంగా పక్కన పెట్టారు.విజయవాడ గ్రేటర్ సిటీ ప్రతిపాదనలో భాగంగా ఆ? మండలాల్లో ఉన్న 75 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని 2014-2019 మధ్య ప్రతిపాదనలు వచ్చాయి. కానీ గత ఐదేళ్లు ఈ ప్రతిపాదనల్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనల్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటైతే కేంద్రం నుంచి నిధులు కూడా వస్తాయి.. అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.. అందుకే ఈ ప్రక్రియన వేగవంతం చేయనున్నారు. విజయవా డలోకి ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న ఎన్నో గ్రామాలు, పట్టణాలు కలిసిపోయాయి.. కానీ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల హోదాలోనే ఉన్నాయి. అందుకే అభివృద్ధికి అవకాశం లేకుండా పోయింది. అందుకే విలీన ప్రక్రియను పూర్తిచేసి విజయవాడను గ్రేటర్ కార్పొరేషన్‌గా మార్చాలని భావిస్తున్నారు.తిరుపతిని గ్రేటర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు, గ్రామాల విలీనానికి సంబంధించి గతేడాది




తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి మండలాల్లోని 64 గ్రామాలను గ్రేటర్ తిరుపతిలోకి విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మంగళం, అవిలాలలు తిరుపతి నగరంలో కలిసిపోయాయి.. అవి పంచాయతీలుగా ఉండటంతో అభివృద్ధి పనులు నిలిపోయాయి. ప్రతిపాదించిన గ్రామాలతో పాటుగా నగరంలో కలిసిన ప్రాంతాలతో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విలీన ప్రక్రియపై త్వరలోనే క్లారిటీ వస్తుంది అంటున్నారు.గ్రేటర్ విశాఖపట్నంలోకి 64 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఉన్నాయి. తాజాగా ప్రతిపాదిం చిన గ్రామాల్లో 60శాతం నగరంలో కలిసిపోయాయి. అందుకే ఈ పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకుంటే మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా గ్రామాల విలీనం చాలా ముఖ్యమని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి, భీమిలి, గాజువాక మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖపట్నంలో విలీనమైన తర్వాతే అభివృద్ధి చెందాయని చెబుతున్నారు.

# పెట్రోల్ వినియోగం లో గోవా టాప్..

హైదరాబాద్, : అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024-25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినయోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు.ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్లవినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది. చిన్న రాష్ట్రాల్లో టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణ, ఆంధ్రల్లో మిక్స్‌డ్ ఎకానమీ (2-వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స్ 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక,
పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్‌లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హై?కన్సూ?యమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్‌ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ స్మార్ట్ నేషన్‌గా మారుతుంది.

# ఏపీకి ఆర్థిక కష్టాలు



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకీ కఠినంగా మారుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. 2014 జూన్ 2 న రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేకపోయిందన్నది వాస్తవం. రాజకీయంగా తీవ్రమైన పోటీ ఉండటంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీలు అనేక ఉచిత హామీలు ఇస్తూ వచ్చాయి. అదే సమయంలో ఆదాయ వనరులు బలపడకపోవడం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది. విభజన సమయంలోనే ఏపీ భారీ రెవెన్యూ లోటుతో ప్రారంభమైంది. కాగ్ నివేదిక ప్రకారం 2014?15 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 24,194 కోట్ల రూపాయల లోటు నమోదైంది. ఆ తర్వాత ఆదాయాన్ని తెచ్చే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవడంతో లోటు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సంవత్సరానికోసారి ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరిగి చివరకు సాధారణ పరిపాలనా అవసరాలకే రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రెండో దశ జీఎస్టీ సంస్కరణల పేరుతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి కొత్త స్లాబులు అమల్లోకి తీసుకొచ్చింది. మధ్యతరగతి, దిగువ తరగతికి ఊరట కలిగించాలన్న ఉద్దేశంతో అనేక వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఏపీకి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతుందన్న అంచనాలు అప్పుడే వినిపించాయి. కానీ వాస్తవంగా చూస్తే ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. గణాంకాలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబర్‌లో జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి 2,777 కోట్ల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదే నెలలో అది స్పష్టంగా తగ్గింది. అలాగే గత ఏడాది నవంబర్ లో 2,827 కోట్ల రూపాయలు వచ్చిన చోట ఈ ఏడాది నవంబర్‌లో కేవలం 2,697 కోట్ల రూపాయలకే పరిమితమైంది. అంటే సుమారు నాలుగు శాతం కంటే ఎక్కువగా ఆదాయం తగ్గినట్టు లెక్కలు చెబుతున్నాయి. జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు వచ్చిన నష్టాన్ని కేంద్రం ఏదో రూపంలో భర్తీ చేయాల్సి ఉన్నా, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఈ దెబ్బ ఎక్కువగా తగిలిందని విశ్లేషకులు అంటున్నారు. గత పదకొండేళ్లలో పరిశ్రమలు, సేవారంగం పెద్దగా ఆదాయాన్ని తీసుకురాలేకపోయాయి. ఇప్పటికీ వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వంపై ఖర్చుల భారం భారీగా పెరిగింది. సామాజిక పెన్షన్లను నాలుగు వేల రూపాయలకు పెంచి సుమారు 65 లక్షల మందికి చెల్లిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు అమల్లో ఉన్నాయి. వీటితో పాటు ఇతర హామీలు కూడా ఉన్నాయి. ఆదాయం తగ్గి, ఖర్చులు పెరగడంతో అప్పులపై ఆధారపడక తప్పడం లేదు. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం కూడా రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. మొత్తం మీద రాష్ట్ర ఆర్థిక స్థితి ఆందోళనకరంగా ఉందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏపీ ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధీకరించడానికి ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి..

# బాధితు కుటుంబాలకు అండగా ఉన్న ఎమ్మెల్యే



గోదావరిఖని:శివాజీ నగర్ వస్త్ర వ్యాపారుల మరియు బుక్క దుకాణాల, ఫ్లవర్ మర్చంట్ దారుల పత్రికా సమావేశం శివాజీ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ లో గోదావరిఖని పట్టణ ప్రాంతంలోని శివాజీ నగర్‌కు చెందిన బట్టల వ్యాపారస్తులు ఈరోజు ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ తమకు అందించిన అభివృద్ధి, సహకారం, అలాగే ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన విధానాన్ని ప్రశంసించారు. వ్యాపారస్తులు మాట్లాడుతూ - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎప్పుడూ, ఎవరికీ, ఎలాంటి అన్యాయం చేయలేదని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా శివాజీ నగర్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం తమ షాపులు తొలగించాల్సి వచ్చినప్పటికీ, తమ జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాకు పూర్తి న్యాయం చేశారని తెలిపారు. షాపులు తొలగించిన వెంటనే వ్యాపారస్తులు ఇబ్బందులు పడకుండా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించి మమ్మల్ని ఆదుకున్నారని, ఇది ఆయన ప్రజాప్రతినిధిగా చూపిన బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమని వారు అన్నారు. అభివృద్ధి జరుగుతున్నా ప్రజల ఉపాధి దెబ్బతినకూడదన్న దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే గోదావరిఖని పట్టణంలోని ప్రతి ఒక్క వ్యాపారస్తుడికి అండగా నిలుస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముందుంటారని వ్యాపారస్తులు స్పష్టంగా పేర్కొన్నారు. వ్యాపార వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే ప్రతి మంచి నిర్ణయంలో ఎమ్మెల్యే పాత్ర కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ నగర్ బట్టల వ్యాపారస్తులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం లో బట్టల శివాజీ నగర్ బట్టల వ్యాపార సంఘం అధ్యక్షులు నమని సదయ్య, వంగ దేవేందర్, పి అంజయ్య, బూర్ల సతీష్, గోలి రంగన్న, ఆడెపు శెంకర్, ఎం రాజమల్లు, ఎం రమేష్, వంగ నవీన్, గజర్ల అరుణ్, కె సంపత్, టీ రాజమౌళి, మురళి, రాజమౌళి, సత్యం, ఎం శ్రీనివాస్, గట్టయ్య, బుక్క దుకాణ అధ్యక్షులు చింతల సదానందం ఫ్లవర్ మర్చంట్ అసోసియేషన్ మెంబర్ సతీష్ తదితరులుపాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నిషియన్ల పోస్టులలో నకిలీలు?



హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికిఈ వెయిటేజీ వర్తించదు. ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులుగ్ర్భాంతికి గురయ్యారు.

# కాపు నేతలకు గాలం

కాకినాడ, : ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటినుంచి పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. సామాజిక వర్గాలను తెరపైకి తెచ్చి మరోసారి విజయం అందుకోవాలని భావిస్తోంది. కానీ అది అంత సులువుగా దక్కేలా లేదు. ఎందుకంటే 2014 నుంచి 2024 వరకు వైసిపి చేపట్టిన ఈ ఫార్ములా ఆ పార్టీకి వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు ఎంత మాత్రం అది సాధ్యమయ్యే అవకాశం లేదు. కుల సమీకరణల ద్వారా రాజకీయం చేస్తామంటే కుదిరే పని కూడా కాదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని కాపు సామాజిక వర్గంపై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతం మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే నినాదం పక్కకు వెళ్లిపోయినట్లు సమాచారం. వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్ అనేది రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ సామాజిక వర్గాలే ఉండేవి. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడడానికి కారణం ఆ రెండు సామాజిక వర్గాలు మాత్రమే. రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గ ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో అక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలిగింది. ఎస్సీలతో పాటు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో గెలవగలిగింది వైయస్సార్ కాంగ్రెస్. అయితే 2019 ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాలు స్టాండ్ అయ్యాయి. ఆపై మిగతా సామాజిక వర్గాలు సహకరించాయి. దీంతో అంతులేని, అద్భుత విజయం సొంతం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ 2024 ఎన్నికలు వచ్చేసరికి బీసీ నామస్మరణ చేశారు జగన్మోహన్ రెడ్డి. ఎలాగూ సంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటుందని భావించి అలా చేశారు. కానీ రాజకీయంతో పాటు ఆర్థికంగా ఏమాత్రం సహకారం అందకపోవడంతో రెడ్డి సామాజిక వర్గం మౌనం దాల్చింది. ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు చీలిపోయి దారుణ పరాజయం ఎదురైంది. ఇప్పుడు కూడా కుల సమీకరణల ద్వారా రాజకీయాలు చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. పవన్ కళ్యాణ్ వెంట కాపు సామాజిక వర్గం ఉందన్న ఆలోచనతో ముద్రగడ పద్మనాభం, చేగొండి హరి రామ జోగయ్య, వంగవీటి మోహన్ రంగా వంటి కుటుంబాలను ఆకర్షించాలని చూస్తున్నారు. ఇప్పటికే ముద్రగడ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. చేగొండి హరి రామ జోగయ్య వైసీపీకి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమార్తె ఆశ కిరణ్ ను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పేరు మోసిన కుటుంబాలు వైసీపీలోకి వస్తే చాలదు. క్షేత్రస్థాయిలో కాపు సామాజిక వర్గంలో ఆశలు చిగురించే ప్రయత్నాలు జరగాలి. వారి సమస్యల పట్ల జగన్మోహన్ రెడ్డి స్పందించాలి. అంతేతప్ప ప్రముఖుల కుటుంబాలను కాపుల్లో చేర్చితే ఎంత మాత్రం వర్కౌట్ కాదు. 2014లో టిడిపి గెలిచిన తర్వాత ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమం లేవనెత్తారు. ఆ సమయంలో కాపులు టిడిపి పట్ల ఆగ్రహంతో ఉండేవారు. అలా వారు వైసిపి వైపు వెళ్లారు. కానీ ఆ పోరాటం చేసిన ముద్రగడ పద్మనాభం 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. కానీ ఆ పార్టీని నమ్మలేదు కాపులు. ఇప్పుడు కూడా కాపు ప్రముఖులను నమ్ముకుంటే కంటే.. కాపుల కోసం చేసే ప్రయత్నాలతో పాటు ప్రకటనలు, పోరాటాల వారికి ఆకట్టుకునేలా చేస్తాయి. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

# రహస్య జీవోల సంగతేంటీ?

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17-18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50-60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

## కంటోన్మెంట్ ఏరియాలో..

# మంచినీటి సరఫర మెరుగుపరచాలి

### బోర్డ్ సభ్యురాలు భానుక నర్మద




సికింద్రాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రిగేడియర్ రాజీవ్, ప్రెసిడెంట్, కంటోన్మెంట్ సీఈవో అర్వింద్ కుమార్ దీవ్వేది, జాయింట్ సీఈవో ఆశిక్ హుస్సేన్, నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ హజరయినారు. బోర్డు సమావేశంలో ప్రజలకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై నర్మద మల్లఖార్జున్ సుదీర్ఘంగా ప్రసంగి ంచారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కంటోన్మెంట్ భూముల పరిహారం కింద ఇప్పటికే రూ.303 కోట్ల రూపాయలు జమ కాగా, ఇంకా రూ.13 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. మిగిలిన ఈ రూ.13 కోట్ల నిధులతో కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డుల్లో పూర్తిగా పాడైపోయిన, దెబ్బతిన్న రోడ్లను వెంటనే నిర్మించాలని ఆమె కోరారు. ఇటీవల ఆస్తి పన్నుల మదింపు సమయంలో పన్నులు 100 నుండి 200 శాతం వరకు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పన్నులను 15 నుండి 20 శాతం వరకు మాత్రమే పెంచి ప్రజలపై భారం పడకుండా చూడాలని బోర్డును కోరారు. ఇటీవల జూబ్లీ బస్ స్టాండ్ ఆవరణలోని అటల్ బిహారీ వాజపేయి పార్క్ ప్రక్కన ఖాళీ స్థలంలో కొందరు బీద ప్రజలు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, ఆ స్థలం రక్షణ శాఖ అధీనంలోని కంటోన్మెంట్ బోర్డు స్థలం కావడంతో నిర్మాణాలను తొలగించడం జరిగింది. దీని వలన అనేక మంది బీద ప్రజలు రోడ్డున పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఈటెల రాజేందర్ స్పందించి నేషనల్ ఎస్టీ కమిషన్లో ఫిర్యాదు చేసి, కూల్చివేసిన స్థలంలోనే కంటోన్మెంట్ బోర్డు ద్వారా మళ్లీ నిర్మాణాలు చేపట్టి వారికి కేటాయించే విధంగా కృషి చేసినందుకు అక్కడ ఎంపి ఈటెల రాజేందర్కు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానుక నర్మద మల్లిఖార్జున్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా 3 నుండి 4 రోజులకు ఒకసారి మాత్రమే అందుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకా లం ప్రారంభమయ్యేలోపే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు.

వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, సంబం ధిత అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచాలని కోరారు. అదేవిధంగా హెచ్ఎండీయే ం ఆధ్వర్యంలో కంటోన్మెంట్లోని రామన్న కుంట (లేక్) సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఒక నెలలోపు ఎన్వోసీ ఇవ్వాలని రక్షణ శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా, బానుక నర్మద మల్లిఖార్జున్ గారు శుభవార్త తెలియజే స్తూ రానున్న పక్షం రోజుల్లో రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కంటోన్మెం ట్కు గ్రాంట్ (నిధులు) మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.

# మేకపాటి స్థానంలో కొత్త నేత

నెల్లూరు, : జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


# లవ్ - రిలేషన్‌పై మిల్కీ బ్యూటీ సంచలన వ్యాఖ్యలు




నేటి యువతకు ప్రేమ, సంబంధం (రిలేషన్) అంటే ఏంటో తెలియదని హీరోయిన్ తమన్నా అంటున్నారు. విజయ్ వర్మ కు బ్రేకప్ చెప్పినప్పటి నుంచి, సమయం దొరికిన ప్రతిసారి ఇలా ఏదో ఒక లెక్చర్‌ను తమన్నా ఇస్తూనే ఉంది. ఆమె లెక్చర్ వింటుంటే.. ఇందులోనే ఆమె బ్రేకప్‌కి కారణం ఉందా?అని అనిపించేలాఉంటుందంటే, అతిశయోక్తి కానే కాదు. అసలెందుకు విజయ్ వర్మతో బ్రేకప్ అయిందనే విషయం ఇప్పటి వరకు రివీల్ చేయని తమన్నా.. ప్రేమ ఒక్కరికే, ఒక్కరితోనే ఉండాల్సిన అవసరం లేదని, ఎన్నిసార్లైనా ప్రేమలో పడవచ్చంటూ.. సరికొత్త అర్థాన్ని యువతకు తెలియజేస్తోంది. తాజాగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. "ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ ఉంటుంది. అది ఒక్కసారి మాత్రమే కాదు.. పలుమార్లు పుడుతుంది. అదే నిజమైన ప్రేమ. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే ఏంటో తెలియదు. మరికొందరు గందరగోళానికి గురవుతుంటారు. ఒక వ్యక్తినినిజంగా ప్రేమించాలని భావిస్తే..వారికిపూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మన భావాలను బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేరు. ప్రేమ అనేదిఒకే ఒకసారి అనుభవంగాఉండాల్సిన పనిలేదు. అది జీవితంలోఅనేకసార్లు జరగాల్సిన ప్రేరణ.అది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేదికాదు. భావోద్వేగపరంగా అంతర్లీనంగా పుడుతుంది" అని పేర్కొన్నారు. ఆమె మాటలు చూస్తుంటే.. ప్రేమ విషయంలో ఆమె స్వేచ్ఛను కోరుకుంటుందనే విషయం అర్థమవుతోంది. ఈ స్వేచ్ఛ కారణంగానే విజయ్ వర్మకు ఆమె బ్రేకప్ చెప్పిందా? అసలు పెళ్లి వరకు వెళ్లిన ఈ జంట.. సడెన్‌గా విడిపోవడానికి కారణం ఏమై ఉంటుంది? తమన్నాని విజయ్ వర్మ అనుమానించాడా? లేక మరేదైనా కారణం ఉందా? అనేది మాత్రం తెలియాల్సి ఉంది. పైన ఆమె చెబుతున్న మాటలను చూస్తుంటే.. కచ్చితంగా ఏదో మెసేజ్ అయితే తమన్నా ఇస్తుందని మాత్రం అనిపిస్తోంది.

# దీనస్థితిలో పావలా శ్యామల..



ఇండస్ట్రీలో ఉన్నవారి జీవితాలు ఎప్పుడు ఎలా ఉంటాయి అనేది ఎవరికి తెలియదు. అందుకే బాగా సంపాదించేటప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలి అని చెప్తూ ఉంటారు. డబ్బు ఉన్నప్పుడు, అవకాశాలు వచ్చేటప్పుడు అంతా బానే ఉంటుంది. ఒక వయస్సు వచ్చాకా అనారోగ్యం పాలయ్యాక.. చేతిలో డబ్బు లేక, అవకాశాలు రాక చాలామంది నటీనటులు దీనస్థితిలో మరణించిన సంఘటనలు చాలా ఉన్నాయి. తాజాగా లేడీ కమెడియన్ పావలా శ్యామల అలాంటి దీనస్థితిలోనే కొట్టుమిట్టాడుతోంది. నటిగా ఎన్నో మంచి సినిమాల్లో నటించి.. ఎంతోమందిని తన కామెడీతో నవ్వించిన ఆమె చివరి రోజుల్లో ఎన్నో కష్టాలను అనుభవిస్తోంది. ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి లేక నరకయాతన చూస్తోంది. గుండె సమస్యలతో బాధపడుతున్న పావలా శ్యామల ప్రస్తుతం ఆర్కే ఫౌండేషన్ లో ఉంటుంది. ఇండస్ట్రీ నుంచి పెద్దలు సాయం చేయాలనీ ఆమె ఎంతో మందిని కోరింది. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్న సాయి ధరమ్ తేజ్, పూరి ఆకాష్ ఇలా తదితరులు తమకు తోచిన సాయం చేశారు. తాజాగా పావలా శ్యామల మళ్ళీ నడిరోడ్డున పడింది. చికిత్స కోసం కూకట్‌పల్లిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా డబ్బు లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది తిరిగి పావలా శ్యామలను క్యాబ్ లో వెనక్కి పంపించేశారు. అర్ధరాత్రి సమయంలో డ్రైవర్ ఆమెను ఒక జంక్షన్ వద్ద దింపి వెళ్లిపోయాడు. ఫుట్‌పాత్‌పై గందరగోళంగా ఉన్న శ్యామలను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు పావలా శ్యామల వద్దకు వచ్చి ఆర్కే ఫౌండేషన్‌కి తరలించారు.అయితే పావలా శ్యామలకు ఈ మధ్యనే అల్లు అర్జున్ ఆర్థిక సాయం చేసినట్లు వార్తలు వచ్చాయి. ప్రతినెలా ఆమెకు పదివేలు అందేలా బన్నీ ఏర్పాటు చేసినట్లు టాక్ నడిచింది. ప్రతి నెల పదివేలు అందింతే.. పావలా శ్యామల చికిత్సకు డబ్బులు లేక ఇలా నడిరోడ్డుపై ఎందుకు ఉంది..? బన్నీ నిజంగానే డబ్బులు పంపుతున్నాడా.. ? ఆ డబ్బులు కూడా పావలా శ్యామల చికిత్సకు సరిపోవడం లేదా.. ? అసలు అల్లు అర్జున్ ఆర్థిక సాయం ఆమెకు అందుతుందా.. ? అని నెటిజన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ ఆర్థిక సాయంపై బన్నీ టీమ్ ఏమైనా స్పందిస్తుందో చూడాలి.

# వ్యూస్ కోసం దిగజారొద్దు..



ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.



# 'స్పిరిట్' కోసం ప్రభాస్ భారీ ప్లాన్..





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'బాహుబలి' తర్వాత ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించిన ప్రభాస్.. ఇటీవల 'సలార్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలతో మరోసారి తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. ఇప్పుడు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాతో మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఆసక్తికర సమాచారం సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ప్రభాస్ బిజీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా కోసం ఏకధాటిగా 60 రోజుల పాటు కొనసాగే భారీ షూటింగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట. ఈ ఒక్క షెడ్యూల్‌తోనే సినిమాకు సంబంధించిన కీలక భాగాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో చిత్ర బృందం ముందుకు సాగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా సినిమాలకు ప్రత్యేకమైన రా అండ్ రస్టిక్ టేకింగ్ ఉంటుంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్ కంటే భావోద్వేగాలకు, యాక్షన్ తీవ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అందుకే ఈ నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో కథకు కీలకమైన సన్నివేశాలు, హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది.

# హీరోలకే అంత ప్రాధాన్యత ఎందుకు







బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ తాజాగా అంతర్జాతీయ వేదికైన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న పురుషాధిక్యత గురించి ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. కాన్స్ వేదికపై మాట్లాడిన ఆలియా భట్.. భారతీయ సినిమాల్లో చాలా కథలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. దాదాపు 75 శాతం సినిమాల్లో కథ కంటే హీరోకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "సినిమాలో హీరో ఉన్నాడా లేదా అనే దానికంటే, కథ బలంగా ఉందా అనే విషయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి" అంటూ ఆమె అభిప్రాయపడ్డారు. ఆలియా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఆమె ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా హాలీవుడ్‌ను పొగిడే క్రమంలో భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడారంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. అలాగే, ఆమె వ్యక్తిగత జీవితాన్ని కూడా ఈ వివాదంలోకి లాగుతున్నారు. ఆమె భర్త రణబీర్ కపూర్ నటించిన యానిమల్ వంటి సినిమాలు తీవ్ర పురుషాధిక్యతతో నిండిపోయి ఉన్నాయని, అలాంటి చిత్రాలపై ఆలియా ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. ఇండస్ట్రీలో మార్పు కావాలని చెబుతున్నవారు ముందుగా తమ ఇంటి నుంచే ప్రారంభించాలి అంటూ కొందరు కౌంటర్లు ఇస్తున్నారు. అయితే మరోవైపు, ఆలియా చెప్పిన విషయాల్లో వాస్తవం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోల పారితోషికాలు, ప్రాధాన్యత, ప్రమోషన్లు అన్నీ కూడా ఇప్పటికీ హీరోలకే అనుకూలంగా ఉంటున్నాయని, హీరోయిన్లకు సరైన గుర్తింపు దక్కడం లేదని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా కృతి సనన్, కంగనా రనౌత్, తాప్సీ వంటి నటీమణులు ఇండస్ట్రీలో ఉన్న వివక్షపై బహిరంగంగా మాట్లాడారు. హీరోలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, హీరోయిన్లను ద్వితీయ స్థానంలో ఉంచుతున్నారంటూ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడీ నేపథ్యంలో మరోసారి ఇండియన్ సినిమాలో మార్పు ఎప్పుడు వస్తుంది? కథలే అసలు హీరోలుగా నిలిచే రోజులు ఎప్పుడు వస్తాయి? అనే ప్రశ్న సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# శర్వానంద్ జోడీగా?



ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది మాజీ మిస్ ఇండియా మానస వారణాసి. ఈ సినిమా విజయంతో ఈ భామకు తెలుగులో భారీ ఆఫర్లొస్తున్నట్లు వినికిడి. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్‌తో కలిసి ఆమె ఓ చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జార్జ్ క్రిష్' పేరుతో ఓ రొమాంటిక్ కామెడీ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని కంఫర్మ్ చేసినట్లు తెలిసింది. ఈ సినిమాలోని కథానాయిక పాత్ర కోసం అనంతిక సనీల్‌కుమార్, రుక్మిణి వసంత్, మమితాబైజు పేర్లు మొన్నటివరకూ వినిపించాయి. చిత్రబృందం చివరకు మానస వారణాసి వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.